c KSR02B173

ప్రజాశక్తి | స్నేహ
ఆదివారం అనుబంధం
జూన్ 25, 2017

ENTERED

ఈద్ ముబారక్



బాలీవుడ్‌లో సంజయ్ దత్‌కి పరిచయం అవసరంలేదు. నర్గిస్ దత్, సునీల్ దత్‌ల కొడుకుగానే కాదు సొంత కృషితో స్టార్‌గా మంచి ఇమేజ్‌ని తెచ్చుకున్నాడు. ఏడాదికి మూడు సినిమాల బిజీ షెడ్యూల్‌తో బాలీవుడ్ మెయిన్ స్ట్రీమ్ హీరోల్లో టాప్ లిస్ట్‌కి చేరిపోయాడు...పేరు పరపతితోపాటు కొన్ని చెడుసావాసాలు తోడయ్యాయి. వ్యక్తిగత జీవితంలో సంజయ్ చాలా సిగ్గరి. అందరితో త్వరగా కలవని సంజయ్ మాదక ద్రవ్యాలకి అలవాటు పడ్డాడు. తల్లి నర్గిస్‌దత్ మరణం తర్వాత మరింతగా మత్తుపదార్థాలకి బానిసయ్యాడు. 32 ఏళ్ల సుదీర్ఘ సినీ

మత్తు వదిలింది

ప్రస్థానంలో సంజయ్ కీర్తిప్రతిష్టలతో పాటు జైలుజీవితాన్ని చవిచూడాల్సివచ్చింది. అప్పటికే కొకెయిన్, హెరాయిన్, మందుకి బానిసయ్యాడు. ఓ చీకటి ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. ఓ సారి మారిషస్‌లో షూటింగ్‌కి వెళుతున్నప్పుడు తన షూస్‌లో హెరాయిన్‌తో ఫ్లయిట్‌లో ప్రయాణించిన సందర్భాలూ ఉన్నాయట. అప్పుడు తనతో తన చెల్లెళ్ళు కూడా వున్నారు. ఒక వేళ పట్టుబడి వుంటే.... ఇవేమీ అప్పుడు తనకి పట్టలేదు. పట్టించుకునే స్థితిలో కూడా లేడు. అధిక మొత్తంలో మత్తు పదార్థాలకి బానిసైన తను తన గది నుండి బయటికి రాలేక ఒంటరితనాన్ని అనుభవించాడు. శరీరాకృతి జీవచ్ఛవంలా మారింది. మత్తుపదార్థాల వినియోగం, ఇతర ఆరోపణలతో దాదాపు పన్నెండేళ్లు గడపాల్సొచ్చింది. అంటే సంజయ్ ఎంతగా మత్తుకి బానిసయ్యాడో అర్థం చేసుకోవచ్చు. వైద్యం కోసం తండ్రి సునీల్‌దత్ తనని అమెరికాకి తీసుకెళ్ళాడు. అన్ని రకాల మత్తుపదార్థాలకీ తను ఎడిక్ట్ అయ్యాడని తెలిసి షాక్ అయ్యాడు. మత్తుపదార్థాలకి బానిసయితే వాటి నుండి బయటపడలేమనే సంగతి అప్పుడప్పుడే సంజయ్‌కీ తెలిసొచ్చింది.

డాక్టర్లు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. అయినా సంజయ్ ఇప్పటికీ సజీవంగా వున్నాడంటే.... మత్తు నుండి బయటికి రావాలని తను తీసుకున్న దృఢ సంకల్పమే. అమెరికాలో ట్రీట్‌మెంట్ తర్వాత కూడా మాదకద్రవ్యాలని సప్లయ్ చేసే కొందరు సంజయ్‌ని కలిశారు. అయితే వాటిని తిర్కరించేంతలా తన వ్యక్తిత్వాన్ని తిరిగి మలుచుకో గలిగాడు. నేడు చాలా మంది యువతని తనలా మత్తుకి బానిసలు కాకుండా ఉండేందుకు కృషిచేస్తున్నాడు. యువత ఇలా వ్యసనాల బారిన పడకుండా వారిలో సామాజిక స్పృహని కల్పిస్తూ వివిధ సందర్భాల్లో తన ప్రసంగాల ద్వారా వాళ్ళ ధోరణుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు సంజయ్‌దత్.

KSR02B173



దూసుకొస్తున్న కిడాంబి

అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో దూసుకెళుతున్న రాకెట్ కిడాంబి నమ్మాళ్వార్ శ్రీ కాంత్. అపూర్వ విజయాలతో దేశ ఖ్యాతిని ఇనుమడింపచేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు. 24 ఏళ్ల వయస్సులో మూడేళ్ల కాలంలో మూడు సూపర్ సిరీస్ టైటిళ్లతో అందరిచేతా సూపర్బ్ అనిపించుకున్నాడు. గతేడాది రియో ఒలింపిక్స్‌లోనూ నెంబర్ వన్ షట్లర్ లిన్‌డాన్‌కి గట్టిపోటీనిచ్చాడు. చేతి మణికట్టు గాయాన్ని కూడా లెక్క చేయకుండా ఆడేంత క్రీడాస్ఫూర్తి తనది. కొన్ని సందర్భాల్లో పరాజయం పాలైనా స్ఫూర్తిదాయకమైన ప్రదర్శనలతో అందర్నీ అలరించాడు. ఒలింపిక్స్ స్వర్ణ పతకమే ధ్యేయంగా దూసుకెళుతున్న ఈ తెలుగు కుర్రాడి పరిచయం మీ కోసం.

ఫిబ్రవరి 7న 1993 గుంటూరులోని చంద్రమౌళీశ్వర నగర్ చెందిన కుటుంబంలో జన్మించాడు కిడాంబి నమ్మాళ్వార్ శ్రీకాంత్. ఎనిమిదేళ్ల ప్రాయంలో రాకెట్ చేతపట్టాడు. తండ్రి కెవీఎస్ కృష్ణ. తల్లి రాధా. అన్నయ్య నందగోపాల్ కూడా బ్యాడ్మింటన్ ఆటగాడే. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో బ్యాడ్మింటన్ శిక్షణతో తన క్రీడా ప్రస్థానం ప్రారంభమైంది. 2001లో పూర్తిస్థాయి క్రీడాకారుడిగా బ్యాడ్మింటన్ రాకెట్ చేతబట్టిన కిడాంబి అంచెలంచెలుగా ఎదిగి ఎన్నో విజయాలని సాధించాడు. ప్రపంచ స్థాయి పోటీల్లో తలపడేంత పట్టుసాధించాడు. 2012లో హైదరాబాద్‌లోని గోపిచంద్ అకాడమీలో చేరాక మరింత రాటుదేలాడు. అదే సంవత్సరం మాల్దీవుల్లో జరిగిన ఇంటర్నేషనల్ ఛాలెంజర్ టోర్నీలో టైటిల్‌ను సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. రియో ఒలింపిక్స్ నుంచి కొద్ది కాలం గాయాలతో సతమతం అయినా క్రీడాస్ఫూర్తితో తక్కువ సమయంలోనే ఈ స్టార్ రాకెట్ తిరిగి ఫామ్‌లోకి రావడం విశేషం. కోర్టులో దిగాడంటే కళ్లు చెదిరే క్రాస్ కోర్టు షాట్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడతాడు. విజయమే ధ్యేయంగా ఆటతీరు సాగుతుంది. అయితే ప్రత్యర్థిని తక్కువగా అంచనా వేయకుండా చివరి పాయింట్ వరకు అమీతుమికి తలపడే నైజం ఇతనిది. గాయాల బెడదను అధిగమించి ప్రత్యర్థులను చిత్తు చేసిన సందర్భాలెన్నో.... ఈ ఏడాది వరుసగా మూడు టోర్నీల్లో ఫైనల్‌లోకి అడుగుపెట్టాడు శ్రీకాంత్.

మూడేళ్లలో సూపర్ సిరీస్‌ల్లో హవా...

2014లో సంచలన విజయంతో అంతర్జాతీయంగా ఓ మెరుపు మెరిశాడు. రెండుసార్లు ఒలింపిక్ ఛాంపియన్‌షిప్ సాధించిన ప్రపంచ నెంబర్ వన్ షట్లర్ లిన్ డాన్ (చైనా)పై చైనా ఓపెన్ సిరీస్ ఫైనల్లో 21-19, 21-17తో మట్టి కరిపించి తొలి సూపర్ టైటిల్‌తో సత్తా చాటాడు. 2015లో ఇండియా ఓపెన్‌లో విక్టర్ అక్సిల్‌సెన్‌పై పోరాడి జయభేరి మోగించాడు. 18-21, 21-13, 21-12తో రెండో టైటిల్‌ను సాధించాడు. ఇదే సంవత్సరం స్విస్ ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్‌లో గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీలో విక్టర్‌ని ఫైనల్స్ లో చిత్తు చేశాడు. దీంతో స్విస్ ఓపెన్ సాధించిన తొలి భారతీయుడిగా ఖ్యాతిని ఆర్జించాడు మన శ్రీకాంత్. 2016 రియో ఒలింపిక్స్ క్వార్టర్స్‌లో లిన్ డాన్ చేతిలోనే శ్రీకాంత్ పరాజయం పాలయ్యాడు. తొలి సెట్‌ను కోల్పోయినా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా పోరాడిన శ్రీకాంత్ రెండో సెట్లో 21-11తో జయభేరి మోగించి స్కోర్లను సమానం చేశాడు. చేతి మణికట్టు గాయంతోనే ఆడి సూపర్ అనిపించాడు. ప్రత్యర్థికి చెమటలు పట్టించాడు. శ్రీకాంత్‌తో ఆడిన మ్యాచ్‌లో తాను కష్టపడాల్సి వచ్చిందని లిన్ డాన్ సైతం కితాబిచ్చాడంటే తన పోరాట పటిమ ఎలాంటిదో అర్థమవుతుంది. ఈ ఏడాది సింగపూర్ ఓపెన్ ఫైనల్స్‌కు చేరిన శ్రీకాంత్ భారత్‌కు చెందిన సాయి ప్రణీత్ చేతిలో పరాజయం చెంది రన్నరప్‌గా నిలిచాడు. జకర్తాలో ఈ నెలలో జరిగిన ఇండోనేషియా గ్రాండ్ ప్రిక్స్‌లో సంచలన విజయాలతో ఫైనల్స్‌కు చేరిన కిడాంబి జపాన్‌కు చెందిన క్వాలిఫైయర్ కజుమస సకాయ్‌పై అలవోక విజయంతో మూడో టైటిల్‌ను హస్తగతం చేసుకున్నాడు.

రానున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటేందుకు శ్రీకాంత్ పావులు కదుపుతున్నాడు. మరో మూడేళ్లలో ఒలింపిక్స్ జరగనున్నాయి, రానున్న అన్ని టోర్నీల్లో ప్రతిభను చాటేందుకు ఉవ్విళ్లూరుతున్న శ్రీకాంత్ ఈసారి టోక్యోలో జరగనున్న పోటీల్లో విజయ సాధనకి కృషిచేస్తున్నాడు.

వరుస విజయాలు..

డగ్లస్‌లో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్ (2011)లో బాలుర డబుల్స్‌లో కాంస్యం, మిక్స్‌డ్‌లో రజతం సాధించాడు. 2011 ఆసియాన్ జూనియర్ ఛాంప్‌లో కాంస్యం, 2016 గౌహతిలో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్ పురుషుల టీమ్, సింగిల్స్‌లోను స్వర్ణాలు వశం చేసుకున్నాడు. 2016 ఆసియా టీమ్ ఛాంప్‌లో కాంస్యంను చేజిక్కుంచుకున్నాడు. నాలుగు సూపర్ ఫైనల్స్‌కు



చేరగా మూడు తన ఖాతాలో వేసుకోవడం గమనార్హం. ఇప్పటి వరకు సింగిల్స్‌లో 137 మ్యాచ్‌ల్లో విజేతగా నిలవగా, 75 మ్యాచ్‌ల్లో పరాజయం పాలయ్యాడు. కెరీర్‌లో ఎనిమిది సింగిల్స్ టైటిళ్లను సాధించాడు. 2015లో జూన్ 4న వరల్డ్ మూడో ర్యాంకుకు చేరుకున్నాడు. ఇదే కెరీర్‌లో అత్యంత మెరుగైన ర్యాంకు. వచ్చే ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాలని శ్రమిస్తున్న శ్రీకాంత్‌కు ఆల్ ది బెస్ట్.

- ఈశ్వర్ నెట్టెం

ఇండెక్స్

వినూత్నం................3
ఊరు మారిపోయింది

స్టార్........4
కళ్లతో మాట్లాడితే...

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం............... 10
నకిలీ రాజకుమారుడు

స్ఫూర్తి..............11
హ్యాకథాన్ వీరుడు

కవిత్వమ్...............14
అతడు

తెలుసా 15
ఉల్కా లోకం

ఈద్ ముబారక్



అట్టమీది కథ...6



మౌన ప్రేమల కథ ఆపాత చిత్రం - 12

కథ 16
బంధం

ప్రత్యేకం...........19
గోడ లైబ్రరీలు

కొత్త పుస్తకాలు..............20
ఆలోచించాల్సిన సమయం ఇదే

రుచి............21
షీర్ కుర్మా

బాల నేస్తాలు............22
అతి చిన్న సొరచేప

పద వికాసం......24

బడిగంట మోగింది

స్నేహలో ప్రచురించిన స్టార్ స్నేహ ఉల్లాల్ టివి సీరియల్స్ నుంచి వెండితెరపైకి వచ్చి సినిమాల్లో నటించి అభిమానులకు దగ్గరవ్వడం అభినందనీయం. అట్టమీది కథ 'వెలుగుల చదువులు'లో ఫీజులు షాక్ ఇస్తున్న సంగతి చక్కగా వివరించారు. మధ్యతరగతి వాళ్ళు పిల్లల్ని చదివించలేక బాధపడుతున్నారు. నగర వీధుల్లో ఎంతో మంది పిల్లలు అనాథలుగా తిరుగుతున్నారు. ఇలాంటి పిల్లలకి ప్రభుత్వం చేయూతనివ్వాలి. ఆకలితో అలమటిస్తూ వీధుల వెంట తిరిగే చిన్నారులని ప్రభుత్వం బడికెళ్ళేలా చేయాలి. పాఠశాలల్లో ఫీజులు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటు న్నాం. ఆ పాత చిత్రం 'తాత మనవడు'లో దాసరి గారు చక్కని సన్నివేశాలని చిత్రీకరించారు. తెలు గు చిత్ర పరిశ్రమ పెద్ద బలాన్ని కోల్పోయింది. కార్మికుల పక్షాన ఎన్నో చిత్రాలని తీసిన దాసరికి జోహార్లు. బాల నేస్తాలులో బుజ్జి స్టార్ పవన్ కళ్యాణ్, నీడతో బొమ్మ, ముగ్గురు వ్యక్తులతో బొమ్మలు బాగున్నాయి. చివరి అట్టపై పూలతో కేకులు, గులాబి పువ్వులు ఆనందింప జేశాయి.

-అనుపోజు సంతోషీ నాగరాజు,
విజయనగరం.

వెలుగుల చదువులు

ఈ వారం స్నేహ అట్టమీది కథ 'వెలుగుల చదువులు' ఆలోజింప చేసింది. ధనసంపాదనే ధ్యేయంగా కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల్లో సాగుతున్న దోపిడి, రాపిడి గురించి ఈ వ్యాసం లోతుగా చర్చించింది. పిల్లలపై విపరీతమైన పని భారాన్ని పెంచి, వారిని మానసికంగా శారీరికంగా హింసిస్తున్న విధానాలకు స్వస్తి పలకాలి. ఆలోచనా ధోరణికి అవకాశం ఇవ్వకుండా బట్టీ పట్టించడం వల్ల విద్యార్థి మానసికంగా ఎదగలేడన్న సత్యాన్ని గ్రహించాలి. ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టుకోవడం అందరి బాధ్యత. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. 'తాతమనవడు' చిత్రవిశేషాలు అలరించాయి. దాసరిలోని ప్రతిభను గుర్తించి దర్శకుడుగా అవకాశం ఇచ్చిన నిర్మాత రాఘవ అభినందనీయుడు. కథాకథనంలో, నటీనటుల ఎంపికలో దాసరి తీసుకున్న శ్రద్ధ అభినందించాల్సిన విషయం. రికార్డులు బద్దలు కొట్టిన 'తాతమనవడు' చిత్రంలో సి.నారాయణ రెడ్డి, శ్రీశ్రీ పాటలు, రమేష్ నాయుడు సంగీతం చిత్ర విజయానికి దోహద పడ్డాయి. సందే శాత్మక చిత్రాలకు ఒరవడి దిద్దిన 'తాతమనవడు' ఎప్పటికీ ఎవర్ గ్రీన్.

-మంకు శ్రీను, కొప్పర్రు

కూతురైనా కొడుకైనా

స్నేహ సంచికలో వచ్చిన అట్టమీది కథ 'ప్రియమైన' మీకు ద్వారా ఉత్తరాలకి సంబంధించిన పాత విషయాలని జ్ఞాపకం చేశారు. 'కూతురైనా కొడుకైనా' కథ చదివించింది. నవ్వుల్ పువ్వుల్ నవ్వించాయి. ఆ పాత చిత్రాల ద్వారా కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం.

-మధు చైతన్య, విశాఖపట్నం.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ENTERED
కథా నిలయం
శ్రీకాకుళం

ఊరు మారిపోయింది

నిన్న మొన్నటి దాకా బీహార్... బాల్యవివాహాలు జరిగే రాష్ట్రాల్లో మొదటి స్థానంలో వుంది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటు న్నాయి. నిజానికి ఈ మార్పు ప్రభుత్వమో లేక ఏ స్వచ్ఛంద సంస్థో తెచ్చిన మార్పో కాదు. ఫుట్‌బాల్ క్రీడ ద్వారా వచ్చింది. వినడానికి కాస్త ఆశ్చర్యంగా వుందా... అయితే మీరే చదివి తెలుసుకోండి.

బీహార్‌లోని ఓ మారుమూల గ్రామం రామ్‌పంత్. వేసవి వచ్చిందంటే చిన్నారులు, పెద్దవాళ్ళతో అక్కడ చాలా కోలాహలంగా వుంటుంది. ఆ హడావిడంతా అక్కడ జరిగే లగాన్ వేడుకది. చిన్నారుల బంగారు భవిష్యత్తును కాలరాస్తున్నది ఈ వేడుకే... సహజంగా వేసవొచ్చిందంటే పిల్లలు ఆటపాటలతో కేరింతలు కొడుతుంటారు. కానీ ఇక్కడ మాత్రం పెళ్ళి పందిళ్ళలో చిన్న పిల్లలందరూ కొలువుతీరు తుంటారు. వేసవి అక్కడ బాల్య వివాహాలు నిర్వహించే కాలం. వివాహం జరగబోయే చిన్నారులంతా పన్నెండేళ్ళలోపు పిల్లలే...కొన్నేళ్ళుగా రామ్‌పంత్‌లో కొనసాగుతున్న ఈ బాల్యవివాహాల దురాచారం పక్క ఊళ్ళకీ పాకేసింది. దాదాపు ఎనిమిది గ్రామాల్లోని చిన్నారుల బంగారు భవిష్యత్తుని కబళిస్తోంది ఈ లగాన్. ఆ సాంఘిక దురాచారాన్ని ఇటీవలే అక్కడి బాలికలు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. వీరంతా తొమ్మిది పది తరగతులు చదువుతున్న బాలికలే. వాళ్ళలో అంతటి ధైర్యాన్ని పెంచేందుకు అక్కడ కృషిచేస్తోంది మరెవరోకాదు....సుకన్యా క్లబ్. గ్రామ పంచాయతీ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ క్లబ్‌లో బాలికలు రెండు బృందాలుగా పనిచేస్తుంటారు.

మార్పు మొదలైంది వీళ్ళతోనే

నుర్షద్ పర్వీన్(14), చంద్రరేఖా కుమారి(16) బాల్యవివాహానికి బలికావాల్సి వచ్చేది. అయితే వాళ్ళు ఈ తంతుని వ్యతిరేకించారు. నుర్షద్ బీహార్‌లోని మంగళ్‌పూర్‌కి చెందిన చిన్నారి. చిన్న వయసులోనే తనకి తల్లిదండ్రులు పెళ్ళిచేయాలనుకున్నారు. పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టారు. పద్దెనిమిదేళ్ళు నిండే వరకూ తను పెళ్ళిచేసుకోనని చెప్పటం తల్లిదండ్రులని ఆశ్చర్యపరిచింది. సుకన్యా క్లబ్ ద్వారా తను తెలుసుకున్న విషయాలని తల్లిదండ్రులకి వివరంగా చెప్పి పెళ్ళి ప్రయత్నాలు విరమించుకునేలా వారిని ఒప్పించగలిగింది. చంపారన్‌కి చెందిన చంద్రలేఖది మరింత దయనీయ స్థితి. గ్రామీణ ఆచారాల్లో భాగంగా చిన్న తనంలోనే తను చదువుకు దూరమయ్యింది. తల్లిదండ్రులు తన కంటే ఎక్కువ వయసున్న వ్యక్తితో వివాహం చేయాలనుకున్నారు. సుకన్యా క్లబ్ ప్రసంగాల ద్వారా ప్రేరణ పొందిన చంద్రలేఖ ఆ వివాహాన్ని తిరస్కరించింది. ఇది కొన్నేళ్ళ క్రితం చంపారన్, రామ్‌పంత్ గ్రామాల్లో చోటుచేసుకున్న ఘటనలు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది నుస్రత్. కోర్ కమిటీ సభ్యురాలిగా పనిచేస్తూ బాల్యవివాహాలు ఎంత ప్రమాదకరమనే విషయాలపై మంగళ్ పూర్, బోడ్‌సర్, కర్మహ, నరింఘర్, సిధోన్ గ్రామాల్లో అవగాహనా సదస్సులని నిర్వహిస్తూ బాలికలని చైతన్యపరుస్తోంది. స్థానిక విద్యావేత్తలు పంచాయితీ ప్రముఖుల సాయంతో బాల్యవివాహాలని అడ్డుకుంటోంది. చదువుకి దూరమైన చంద్రరేఖ బాల్యవివాహాలని ప్రతిఘటించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. ఆడపిల్లల చదువు, ఆరోగ్యం, గృహహింస, లింగవివక్ష ఇలా ఎన్నో అంశాలపై క్యాంపెయిన్‌లని నిర్వహిస్తోంది.

ఫుట్‌బాల్ దిశగా...

సుకన్యా క్లబ్‌లో చేరిన ఆడపిల్లలో బాల్యవివాహాలని రూపుమాపే కార్యక్రమాలని ఒక బృందం నిర్వహిస్తే... రెండో బృదం బాలికల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతోంది. నిజానికి ఈ క్రీడా స్ఫూర్తే అక్కడి పరిస్థితుల్లో మార్పుకు దోహదపడుతోంది. సుకన్యా క్లబ్ గురించి ఎక్కువ మందికి తెలిసింది కూడా ఫుట్‌బాల్ క్రీడ వల్లే. కొన్నేళ్ళుగా అక్కడ వేళ్ళూనుకున్న బాల్యవివాహాల ఆలోచనల నుండి బైటపడేందుకు ఈ క్రీడ ఎంతగానో తోడ్పడుతోంది. ఫుట్‌బాల్ క్రీడలో ఆడపిల్లలకి శిక్షణ ఇవ్వడంతోపాటు వివిధ స్థాయిల్లో పోటీలని నిర్వహిస్తుంటారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ గ్రామాలకి చెందిన బాలికలు ముందుకొస్తున్నారు. క్రీడలో తమ చిన్నారులు రాణిస్తుండటంతో పెద్దలు సైతం తమ పిల్లలకి చిన్నతనంలో పెళ్ళిచేయాలనే ఆలోచనలని మానుకుంటున్నారు. వారాంతాల్లో సుకన్యా క్లబ్ నిర్వహించే మ్యాచ్‌ల్లో బాలికలకి క్రీడలో శిక్షణతోపాటు వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పిస్తుంటారు. ఒక రకంగా బాలికలు తమ ఆలోచలని పంచుకునేందు ఈ మ్యాచ్‌లు వేదికలుగా మారు తున్నాయి. 'గౌరవ్ గ్రామీణ్ మహిళా వికాస్ మంచ్' పేరున ఫుట్‌బాల్ క్రీడని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తోంది క్లబ్‌కి చెందిన బాలికల బృందం. బీహార్ గ్రామీణ ప్రాంతాలకి చెందిన బాలికలంతా ప్రస్తుతం తమ భవిష్యత్తుని తీర్చిదిద్దుకోవడమే కాదు సామా జిక అభివృద్ధిపైనా దృష్టి సారిస్తున్నారు.



\- శర్వాణి

కళ్లతో మాట్లాడితే...



చారడేసి కళ్లతో అందర్నీ భయపెట్టింది... అలానే అంతలేసి కళ్లలో నీరు చేరి బాధా పెట్టింది. కళ్లతో తేలిగ్గా హావభావాల్ని పలికించే హీరోయిన్ నందిత రాజ్. పుట్టింది ముంబైలో అయినా తెలుగు అమ్మాయే అని చాలామందికి తెలీదు. తేజ చిత్రంతో పరిచయమైన నందిత ఇప్పుడున్న యంగ్ స్టార్‌లలో ప్రత్యేకమైన నటిగా పేరు తెచ్చుకుంది. కెరీర్‌లో తొందర లేకుండా నిదానంగా ప్రశాంతంగా సాగిపోతున్న నందిత గురించి కొన్ని వివరాలు...

తండ్రి రాజ్ కుమార్ సైన్యాధికారి కావడంతో చిన్నప్పుడు ప్రతి రెండేళ్లకు ఓ కొత్త ప్రాంతంలోకి మారాల్సి వచ్చేది. అలా నందిత ముంబైలో పుట్టి ఢిల్లీ, హైదరాబాద్‌లో చదివి ఇలా ఎన్నో ఊళ్లలో పెరిగింది. జమ్ము, పూణె, బెంగళూరు ఇలా చాలా ప్రాంతాలు తిరిగాక చివరకు పదో తరగతి నాటికి హైదరాబాద్‌కు కుటుంబం వచ్చి స్థిర పడింది.

- తల్లిది వైజాగ్, తండ్రిది హైదరాబాదే అయినా సినిమాల్లోకి వచ్చేంత వరకు తెలుగు అంతగా మాట్లాడటం రాదు.
- తాను 12వ తరగతిలో ఉన్నప్పుడు చదువుల విరామంలో సినిమాల్లోకి అనుకోకుండా వచ్చింది.
- తేజ చిత్రం 'నీకు నాకు డాష్... డాష్...' (2012) కోసం స్టార్ హంట్ పెట్టారు. అందులో దాదాపు 70 వేల మంది పాల్గొన్నారు.
- నందితకు తెలీకుండానే ఆమె ప్రొఫైల్‌ను తల్లే ఉంచింది. ఆ తర్వాత ఆడిషన్లలో ప్రతిభ చూపడంతో సినిమా హీరోయిన్ అవకాశం కలిగింది.
- సినిమా మీద ఆసక్తి లేకున్నా డ్యాన్స్‌లో మాత్రం ఇరగదీసేది. పాఠశాల, కళాశాలల్లో సాంస్కృతిక ఉత్సవాలు జరిగితే నందిత డ్యాన్స్ ఉండాల్సిందే.
- హైదరాబాద్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్‌లో చదివాక ఎంబీయేను దూర విద్యలో చేస్తోంది.
- తేజ చిత్రం తర్వాత సుధీర్ బాబు హీరోగా 'ప్రేమ కథా చిత్రం'లో అవకాశం వచ్చింది.
- ఆ చిత్రం చేస్తుండగానే మలయాళ చిత్రం 'లండన్ బ్రిడ్జ్'లో కూడా అవకాశం దక్కింది.
- 'ప్రేమ కథా చిత్రం' కెరీర్‌ను మలుపు తిప్పింది. కానీ అదే తరహా హార్రర్ నేపథ్యంలోని చిత్రాలను తర్వాత కాదనుకుంది.
- విభిన్న కథ ఉన్న చిత్రాలను అది కూడా స్క్రిప్ట్‌ను చూసి చిత్రాలను ఒప్పుకుంటూ నిదానంగానే అయినా మంచి పాత్రలతో కెరీర్‌ను విజయవంతం చేసుకుంటోంది.
- ఇలా 'లవర్స్', 'రామ్‌లీల', 'కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ', 'శంకరాభరణం', 'సావిత్రి' చిత్రాలను చేసింది.
- 'ప్రేమ కథా చిత్రం' తర్వాత అంతటి విలక్షణ పాత్ర 'సావిత్రి'లో చేసింది.
- పెళ్లిలో పుట్టి పెళ్లంటే ఇష్టపడే అమ్మాయి పాత్రలో నందిత నటన అద్భుతంగా ఉంటుంది.
- ప్రస్తుతం తారక్ చిత్రం 'లవకుశ'లో చేస్తోంది. ఇప్పటి వరకు చిన్న చిత్రాలు చేసిన నందితకు ఇది భారీ చిత్రమే.
- పుస్తకాల పురుగు అయిన నందితకు అభిమాన రచయిత నికొలస్ స్పార్క్స్. పుస్తకం 'ది ఫౌంటెయిన్ హెడ్'.
- గ్లామర్ ఇండస్ట్రీలో తిండికి మూతి కట్టుకుని ఉండాలి కానీ నందిత మాత్రం చైనీస్ ఫుడ్ నుంచి జంక్ ఫుడ్ వరకు బానే లాగిస్తుంది. తిండి విషయంలో ఏ రాజీ పడదు.
- 'సావిత్రి' ఆడియో ఫంక్షన్‌లో ఓ అగ్ర హీరో అనుచితంగా అమ్మాయిలపై వ్యాఖ్యలు చేస్తే ఆ విషయంపై ధైర్యంగా మాట్లాడి తప్పుపట్టింది.
- నందితకు ఓ ముద్దు పేరు అది దెయ్యమక్క. అది కూడా చిన్నారులు పెట్టిందే. 'ప్రేమ కథా చిత్రం'లోని పాత్రతో ఆ పేరు వచ్చేసింది.
- అంత పెద్ద కళ్లతో ఆకట్టుకునే నందితకు భావోద్వేగ సన్నివేశాలు చేసేపుడు కంట తడి పెట్టాల్సి వచ్చినప్పుడు గ్లిజరిన్ మీదే ఆధారపడుతుందట. ఎంత ప్రయత్నించినా ఏడుపు అస్సలు రాదట.
- తెలుగు మాట్లాడే హీరోయినే కానీ ఇప్పటి వరకు సినిమాల్లో ఆమె పాత్రకు డబ్బింగ్ తాను చెప్పింది లేదు. అలాంటి అవకాశం కోసమే ఆమె ఎదురుచూస్తోంది.
- చాలా రిజర్వ్‌గా ఉండే వ్యక్తిత్వం కావడంతో సినీ పరిశ్రమలో మిత్రులు లేరు. అలాగే ఆడియో ఫంక్షన్లు, సినిమాలో తప్పితే ఎక్కడ నందిత సందడి కనిపించదు.
- తెలుగు సినిమాలకే పరిమితమవడానికి కారణం తనకు భాష తెలీకపోతే భావోద్వేగాల్ని పలికించడం కష్టమని అవకాశాల్ని వదులుకుంది.
- సమయం దొరికితే కుటుంబ సభ్యులతో గడపడానికే ప్రాధాన్య మిస్తుంది. ★



నవ్వుల్ - పువ్వుల్

చెకింగ్

టీచర్ :వాన పడేటప్పుడు మెరుపులు ఎందుకొస్తాయి?

బంటీ : భూమి మొత్తం తడిసిందో లేదో అని ఎవరైనా పై నుంచి టార్చ్‌లైట్ వేసి చూస్తుంటారేమో సార్!!

టీచర్ : ఆ....

దెబ్బ తగల్లేదు

టింకు : వురేయ్... నిన్న రాముని కర్రతో బలంగా కొట్టానన్నావ్ మరి వాడికి ఒక్క దెబ్బ కూడా తగల్లేదు..... ఏ కర్రతో కొట్టావ్??

బంటీ : జీలకర్రతో.....!

టింకు : ఆ...

తాగుబోతు తెలివి

రాత్రి భార్యతో గొడవ పడిన విషయం గుర్తొచ్చిన ఒక తాగుబోతు తాగిపడేసిన బాటిల్స్ వంక చూస్తూ...... అసలు గొడవకి ఇవే కారణమని ఒక్కొక్కటే పగలగొడుతున్నాడు.

మొదటి బాటిల్ పగలకొడుతూ : నా భార్యతో గొడవ పడడానికి కారణం నువ్వే....

రెండోది : నా పిల్లలకి దూరం కావడానికి కారణం నువ్వే....

మూడోది : నేను ఇంగితం మర్చిపోవడానికి కారణం నువ్వే....**(నాలుగో బాటిల్ ఫుల్‌గా వుంది)** నిన్నిలా కాదే... మొత్తం తాగేసి ఖాళీ చేశాక పగల కొడతా.

కిసుక్కు

టీచర్ : బంటి టి తర్వాత ఏం వస్తుంది?

బంటీ : బిస్కెట్స్ వస్తాయి సార్!!



అడ్మిషన్స్



ప్రవీ : సార్ మీ ఇంట్లో చిన్నపిల్లలెవరయినా వున్నారా??

శ్రీను : ఏ ఎందుకు?

ప్రవీ : ఏం లేదు సార్...... మా స్కూల్‌లో చేర్పిస్తారేమో అని!!

శ్రీను : లేరయ్యా ...మా ఆవిడా ఇంకా ప్రెగ్నెంట్...

ప్రవీ : పర్లేదు సార్ మా స్కూల్లో డెలివరీ సదుపాయం కూడా వుంది...

శ్రీను :ఆ....

కిసుక్కు సిత్రం

కుర్చీల వంతెన..!

నాకు నచ్చిన చిత్రం



ఇల్లస్ట్రేటర్: లతీఫ్ ఫిత్యాని

సేకరణ: జాన్ ప్రభాకర్, విజయవాడ

అట్టమీది కథ

ఈద్ ముబారక్



క్రమశిక్షణ, దాతృత్వం సమాహారం రంజాన్. ముస్లిం సోదరులు నిబద్ధత, అంకితభావంతో జరుపుకునే పండుగ రంజాన్. ఉదాత్త భావాలను, ఆచరణను, వ్యక్తిత్వ నిగ్రహన్ని, సహనాన్ని నేర్పించే మాసంగా రంజాన్‌ను పిలుస్తారు. సౌహార్ద్ర సమభావాలను పంచాలని అమలిన హృదయాలతో సామూహికంగా సహాయ పడటం ఇందులోని సామాజికాంశం. ఖురాన్‌ను ముస్లింలు పవిత్ర గ్రంధంగా విశ్వసిస్తారు. అది అవతరించిన నెలగా 9వ నెలను పేర్కొనడంతో పండుగ జరుపుకుంటారు. నెలరోజుల పాటు కొనసాగే ఈ ఉపవాస దీక్షలు ఉంటాయి. గత నెల 27న నెలవంక దర్శనమివ్వడంతో ఉపవాసాల దీక్ష ప్రారంభమైంది. ఈద్ అల్ ఫిత్ర్‌తో చివరి అంకానికి చేరుకుని పండుగ ఉత్సాహం రెట్టింపు అవుతుంది. అందరికీ ఈద్ ముబారక్‌లు తెలుపుతూ ప్రపంచం రంజాన్‌ను ఎలా చేసుకుంటుందో కొన్ని వివరాలు ఈ వారం అట్టమీది కథలో.

- షేక్ ఖాజా వలి
9490099550

రంజాన్ సందర్భంగా అన్ని మసీదులను సుందరంగా ఆలకరించి విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలే 'ఇఫ్తార్ విందు'లను నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిల్లోనూ, జిల్లా కేంద్రాల్లో ఉన్నతాధికారులు ఇఫ్తార్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. రంజాన్ అంటే ఇటు నిష్టతో కూడిన ఉపవాస దీక్షలు.. అటు పసందైన హలీం గుర్తుకొస్తాయి. ముస్లింలు ఈ పండుగను పెద్ద పండుగగా పిలుస్తారు. ముంబాయిలో బరహందీ, ఢిల్లీ, హైదరాబాద్‌లో సేమియా, బిర్యానీ, హలీమ్, బెంగుళూరులో బేజాపఫ్, చెన్నైలో నంబకుడి ప్రత్యేక వంటలు. భోజన ప్రియుల మనస్సును ఆకట్టుకుంటాయి.

రంజాన్ పేరు ఎలా వచ్చింది?

రంజాన్ అంటే 'రమ్‌జ్' అని. అరబ్బీ భాష నుంచి ఇది వెలువడింది. మానవీయత వైపు మళ్లించే ఒక నియంత్రణ మాసం రంజాన్. ఈ పదానికి వేడి, కాల్చడం, దహించడం వంటి అర్థాలున్నాయి. రంజాన్ అంటే దైవారాధన మాత్రమే కాదు. దానాలు, ఇరుగుపొరుగు వారిని ప్రేమించే ఆదానప్రదానాలు చేయడం ముఖ్యమైన ఉద్దేశం.

కష్ట సుఖాలు తెలుసుకునేందుకే...

ఆకలి కష్టాలు, పేదల బాధలు, ఆక్రందనలు అందరికీ తెలియజేయడమే రంజాన్ ముఖ్యోద్దేశమని చెపుతుంటారు. ఉపవాసాల వల్ల ఆకలి బాధ తెలుస్తుంది. ఆకలితో బాధపడే వారి పట్ల సానుభూతి పెరుగుతుంది. బాధ్యతల పెంపు, మంచీచెడుల విశ్లేషణ, పశ్చాత్తాపం, సహాయగుణాలు ఈ ఉపవాస దీక్షల ఉద్దేశమని ముస్లింలు విశ్వసిస్తారు. అబద్ధాలాడటం, ఇతరుల పట్ల దౌర్జన్యంగా ఉండడం, మద్యం, జూదం, వ్యభిచారం వంటి వాటికి దూరంగా ఉండాలని మనస్సును అదుపులో పెట్టుకోవాలని నిర్దేశం. వీటిని పూర్తిగా జయించిన వారు తరువాత కాలంలో కొన్నైనా అలవాటవుతాయని దీని వెనుక ఉన్న పరమార్థం. ప్రతిరోజూ వేకువ జామున 4 గంటలకు ముందేలేచి కాలకృత్యాలు తీర్చుకుని రాత్రే వండిన లేదా అప్పుడే వండిన ఆహార పదార్థాలను భుజించి నమాజ్‌కు వెళతారు. మహిళలు ఇళ్లల్లోనే నమాజ్ చేస్తారు. ఉదయం దీక్ష చేపట్టడాన్ని 'సహర్' అని, సాయంత్రం విరమణ సమయాన్ని 'ఇఫ్తార్' అని పిలుస్తారు. ఇలా ఉదయం నుండి సాయంత్రం లాలాజలాన్ని సైతం మింగకుండా నియమంతో ఉంటారు. 11 నెలలు వృత్తిరీత్యా ఏ ఏ పనులు చేసుకుంటారో ఈ నెలలో కూడా ఆ పనులు చేస్తూనే ఉపవాసముండాలని ఇస్లాం చెపుతోంది. ఈ మాసంలో ఐదు ప్రత్యేక రోజుల్లో రాత్రి వేళ్లల్లో ప్రత్యేక నమాజ్ చేస్తారు. 27వ రోజు షబే ఖద్రీగా నిర్వహిస్తారు. ఇది ఖురాన్



ఆవిర్భవించిన రోజుగా విశ్వసిస్తారు. నెల రోజుల్లో చివరి రోజు షవాల్ (నెలవంక) రోజున దీక్ష విరమించి, మరుసటి రోజు ఈద్ అల్ ఫిత్ర్ చేస్తారు. రోజూ మసీదుల్లో ప్రార్థనలు చేస్తూ ఉంటారు. కానీ ఆ రోజున ఈద్గా (నిర్ణీత బహి రంగ ప్రదేశాల్లో) వేలాదిమంది మధ్య జరుగు తుంది. ప్రతి ఒక్కరూ తమకున్నంతలో కొత్త బట్టలు ధరించి ఈద్గాకు వెళతారు. మిగతా కాలం కంటే ఉపవాస దీక్షా కాలంలో పరస్పర సహకారం, సోదరభావం ఎక్కువగా ఉంటుంది. ఈద్‌కు ముందు, తర్వాత ముస్లిమేతరులు ముస్లింలకు శుభాకాంక్షలు చెపుతుంటారు. హద్దుపద్దు లేని హంగామాలు, శృతిమించిన సంబరాలు, అదుపు తప్పిన ఆవేశాలు, ఆనందాలు కూడదని పెద్దలు చెపుతూ ఉంటారు. ఈద్ అల్ ఫిత్ర్ (రంజాన్ పండుగ) సందర్భంగా ముస్లిమేతరులను విందులకు పిలుస్తారు. కొందరు అతిధులకు, ఇరుగు పొరుగువారికి క్యారేజీల ద్వారా సేమ్యాఖీర్ (పాయసం), బిర్యానీ లేదా పలావ్ అందిస్తారు. ఈ పండుగ సందర్భంగా ఆహారపదార్థాలు మరింత రుచిగా వండుతారు. పరస్పర మత విశ్వాసాలకు, ఐక్యత, సమైక్యతలకు చిహ్నంగా రంజాన్ నిలుస్తుంది.

జకాత్, ఫిత్రా

ప్రతి ముస్లిం తన ప్రతి ఏడాది ఆర్జనలో 2.5 శాతాన్ని పేదలకు ఇచ్చి ఆదుకోవాలని ఖురాన్ చెపుతోంది. దీనిని జకాత్ అంటారు. కేవలం నగదే కాక వెండి, నగల విలువను సైతం లెక్కగట్టి పేదలకు విధిగా (దానంగా కాధు) ఇవ్వాలని ఇస్లాం నిర్దేశిస్తుంది. ఏడాదిలో ప్రత్యేకించి ఈ నెలలోనే ఈ కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఉంటారు. రంజాన్‌ను పేదలు సైతం ఒక పర్వ దినంగా, ఆనందంగా జరుపుకోవడానికి ఈ జకాత్ దోహదపడుతుంది. 11 నెలలు పేదరికం అనుభవించే వారు ఈ నెల రోజులు ఉన్నవారి ఉదారతతో కాస్తయినా పౌష్టికాహారాన్ని, కొత్త బట్టలు పొందుతారు.

పండుగ రోజు ప్రార్థనలకు వెళ్లకముందే పేదలకు ఫిత్రా (దానం) చేయాలన్నది నియమం. ప్రతి ఏడాది దీనికి నిర్దేశించుకున్న మొత్తం మారుతూ ఉంటుంది. మత పెద్దలు పేద వారికి ఎంత ఇవ్వాలో కొద్ది రోజులు ముందు చెపుతుంటారు. ఈ ఏడాది పేదలకు ఇవ్వదలచుకున్న వ్యక్తి తినే రెండున్నర కిలోల బియ్యం విలువ లేదా రూ.100లు ఇవ్వాలని మత పెద్దలు నిర్దేశించారు. ఇది నగదు రూపంలో గానీ, దీనికి సమాన విలువలో గోధుమల రూపంలోగానీ ఇవ్వాల్సి ఉంటుంది. కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమంది తరపున ఇవ్వాల్సి ఉంటుంది.

ఇతర దేశాల్లో ....

ఖతార్, ఒమన్, బహ్రెయిన్, కువైట్ వంటి గల్ఫ్ దేశాల్లోనూ, బంగ్లాదేశ్, బర్మా, శ్రీలంక, పాకిస్తాన్ వంటి మన పొరుగు దేశాల్లోనూ రంజాన్‌ను ఘనంగా జరుపుకుంటారు. గల్ఫ్ దేశాల్లో అయితే పగటిపూట రెస్టారెంట్లను మూసివేస్తారు. ఇక్కడ ముస్లిమేతరులు నిర్వహించే రెస్టారెంట్లను సైతం మూసివేస్తారు. ఈ దేశాల్లోని సంపన్నులైన అరబ్బులు రంజాన్ మాసమంతా పౌష్టికాహారాన్ని ఉచితంగా పంపిణీ చేస్తారు. అయితే ఈ దేశాల్లో ఎక్కడా ఆహారాన్ని బహిరంగంగా తినరు. దుబాయ్‌లోని ఏకైక హిందూ దేవాలయం 'శ్రీకృష్ణాలయం'లో రంజాన్ మాసంలో నైవేద్య, ప్రసాదం వేళలు వేరుగా ఉంటాయి. ఇక్కడ ఇఫ్తార్ వేళల అనంతరమే ప్రసాదాలిస్తారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లేబర్ చట్టం ప్రకారం ఈ నెల రోజుల్లో ఉద్యోగులు, కార్మికులకు రోజూ 6 గంటల పని విధానాన్ని విధిగా అమలు చేస్తారు. ఇది వారంలో 36 గంటలకు మించకూడదు. ఇంతకు మించి ఏ పరిశ్రమలు, సంస్థల్లోనైనా పని చేయిస్తే కఠిన శిక్షలుంటాయి.



చిన్నారులకు ప్రత్యేకం

గల్ఫ్‌లోని కొన్ని ప్రాంతాల్లో చిన్నారుల కోసమే ఓ ప్రత్యేకమైన పండుగ రంజాన్ మాసం మధ్యలో చేసుకుంటారు. 14వ రోజున పిల్లలు సాంప్రదాయక కొత్త బట్టలు వేసుకుని వారి వీపున ఓ అందమైన సంచీ తగిలించుకుని ఇరుగు పొరుగు వద్దకు వెళతారు. చేతుల్లో రాళ్లను తీసుకుని వాటిని కొడుతూ ప్రత్యేక శబ్ధం చేస్తూ తలుపులు కొడతారు. 'గారాన్‌గావో'గా పిలిచే ఈ సంప్రదాయానికి ప్రత్యేకమైన పాట కూడా ఉంది. దాన్ని పాడుతుంటే ఇరుగు పొరుగు వారు ఆనందిస్తూ పిల్లలు తెచ్చిన సంచుల్లో కర్జూరాలు, బియ్యం, గోధుమలు, మరికొన్ని పదార్థాలను వేస్తారు. వీటితో ఖతారీ వంటకమైన హరీస్ చేసి పంచుకుంటారు. ఇప్పుడు స్వీట్లను కూడా పిల్లలకు ఇస్తున్నారు. అలాగే డప్పు వాయిస్తూ వీధుల్లో తిరిగే మెసాహరాతీలు కూడా గల్ఫ్‌లో ప్రత్యేకమే. ఉపవాసానికి ముందు ఇలా వాళ్లు అందర్నీ అలెర్ట్ చేస్తుంటారు. ఇప్పటికీ ఈ సందడి అక్కడ వినిపిస్తూనే ఉంటుంది.

ఆర్కిటిక్‌లోను..

24 గంటలూ సూర్యుడు కనిపించే ఆర్కిటిక్‌లోను ముస్లింలు రంజాన్ జరుపుకుంటారు. ఇలాంటి పరిస్థితులే ఇంచుమించు ఉండే లాప్లాండ్, ఫిన్‌ల్యాండ్‌ల్లోను ఈద్ ముబారక్‌లు వినిపిస్తాయి. అక్కడ కేవలం 55 నిమిషాల పాటు సూర్యాస్తమయం ఉంటుంది. అంటే రోజుకు 20 గంటలకు పైగానే వాళ్లు ఉపవాస దీక్ష చేస్తారు. యూకేలో ముస్లింలకు రోజుకు 16-19 గంటల పాటు ఉపవాస దీక్ష సాగుతుంది.

లాంతర్ల వెలుగులో...

రంజాన్ రాత్రుల్ని వెలుగులతో నింపేందుకు ఫనౌస్ అనే ప్రత్యేక లాంతర్లను వాడతారు. ఇవి ఎంతో కళాత్మకంగా ఉంటాయి. చిన్న చిన్న రంధ్రాల

గుండా వచ్చే వెలుగుతో పాటు అవి గుండ్రంగా తిరుగుతుంటే గది నిండా సన్నటి వెలుతురు చిత్రాలు నృత్యం చేస్తున్న అనుభూతి కలుగుతుంది. ఈజిప్ట్, మొరాకోలో ఇవి రంజాన్‌కు ప్రత్యేక శోభను తీసుకువస్తాయి. ఈ సంప్రదాయం రావడానికి కారణం 969లో ఖలీఫ్ మొయిజ్ ఎద్దిన్ అల్లాహ్ కైరో ఆగమనం సందర్భంగా వందలాది లాంతర్లను వెలిగించి స్వాగతం పలికారనే కథ ఉంది. అదే ఆ తర్వాత రంజాన్‌లో భాగమైంది.

ఫిరంగుల గర్జనలు

అరబ్ ప్రపంచంలో రంజాన్ మాసంలో సూర్యోదయాస్తమయాల సమయంలో ఫిరంగుల్ని పేల్చడం ఓ సంప్రదాయం. ఒకప్పుడు సుదూరాన వున్నవారికి కూడా వాటి ధ్వని వినిపించి నియమాలు పాటించేవారు. కానీ ఇప్పుడది ప్రతీకాత్మకం అయ్యింది.

నదీ స్నానాలు కూడా

ఇండోనేషియా, జావాలో రంజాన్ మాసం సందర్భంగా 'పడుసాన్' అనే నదీ స్నానాలు చేయడం సంప్రదాయం. నదులనే కాదు సరస్సులు, సముద్రాలు, నీటి బావులు ఇలా నీటి తావుల వద్ద ప్రత్యేక స్నానాలు చేస్తారు. కుటుంబ పెద్దలు ఆహారాన్ని పంచుకుంటారు.

పెద్దల పండుగ

జావాలోని ముస్లింలు ఉపవాసానికి ముందు తమ పెద్దల సమాధుల్ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. సమాధుల్ని పూలతో అలంకరిస్తారు. 'న్యెకార్' అనే ఈ కార్యక్రమం రంజాన్‌కు వారం ముందే ఉంటుంది. ఇంటి పెద్దలే కాదు రాజులు, నేతల సమాధుల్ని సందర్శించడం అక్కడ ఆనవాయితీ. అలాగే పల్లెల్లోని ముస్లిం మహిళలు కి.మీ.ల దూరం కాలినడకనే పిండి పదార్థాలను తీసుకెళ్లి సమాధుల వద్ద అర్పిస్తారు. దీన్ని న్యాంద్రన్ అంటారు.

మాల్దీవుల్లో మూడు నాలుగు పంక్తుల్లో ఉండే రైవారు అనే ప్రాచీన సాహిత్య ప్రక్రియకు పెద్ద పీట వేస్తారు.

తీయని ఈద్...

ఉత్తర భారతదేశంలో తీపి వంటలు లేకుండా పండుగ పూర్తి కాదంటే నమ్మలేనంత నిజం. ఇక్కడ బెల్లం, పంచదార పాకంతో చేసిన వంటలు ఎంతో ప్రియం. ఇక్కడ ఈద్-అల్-ఫిత్ర్‌నే 'మీఠీ ఈద్' (తీయని ఈద్) అని అంటారు. వంటకాల్లో ప్రముఖమైనది, రుచికరమైనది సేమియా. ఈ సేమియాలను వీరే ప్రత్యేకంగా చేసుకుంటారు. ఢిల్లీలో క్విమామీ సేమియా విశిష్టమైనది. పాలు, పంచదార మిశ్రమాన్ని మరగబెట్టి ఇందులో వేయించిన సేమియాని వేస్తారు. తరువాత బాదం, పిస్తా, జీడిపప్పు, కర్జూరం వంటివాటిని నేతిలో వేయించి ఈ మిశ్రమంలో కలుపుతారు. చివరగా యాలకుల పొడి, కొబ్బరి పొడి కలిపితే ఈ సేమియాకు అద్భుత రుచి సంతరించుకుంటుంది. ఇది చూడటానికి షీర్ కుర్మాలా వున్నా క్విమామీ సేమియా రుచి విభిన్నం.

బెంగుళూరు బేజాపఫ్

బెంగుళూరులో ఇఫ్తార్ విందు అనగానే ముందుగా గుర్తుకొచ్చేది మసీద్ రోడ్డులోని ఫ్రేజర్ టౌన్. ఎందుకంటే ఆల్బర్ట్ బేకరీలో బేజా పఫ్ తినకుండా ఆ ప్రాంతాన్ని దాటిరాలేము. ఇక్కడి 115 సంవత్సరాలు నుండి ప్రత్యేకంగా ఈ బేజా పఫ్‌ను తయారుచేస్తున్నారు. ఎగ్ పఫ్, చికెన్ పఫ్‌లానే బేజా పఫ్ కూడా ప్రసిద్ధి. ఈ బేజా పఫ్ పైకి సాధారణ పఫ్‌లానే వుంటుంది. కానీ లోపల పూర్తిగా మటన్ బ్రెయిన్ కర్రీని నింపి రుచిగా తయారు చేస్తారు. తినేటప్పుడు జ్యూసీగా, మెత్తగా, రుచిగా వుంటుంది. ఇది మా హోటల్ ప్రత్యేకత అని మహ్మమద్ షబ్బీర్ ఫైజాన్ తెలిపారు. శివాజీ నగర్‌లోకి వెళితే రంజాన్‌కి ఇంకా ప్రత్యేకమైన వంటకాలు చేస్తారు. ఒంటె మాంసంతో చేసిన కబాబులు తప్పనిసరిగా వుండాల్సిందే. ఈ కబాబ్స్ వీధుల్లో ఉండే స్టాల్స్‌లో కూడా లభిస్తాయి. వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. తిలక్ నగర్‌లో బీఫ్‌తో చేసిన వంటకాలను చిరుతిండిగా అమ్ముతుంటారు. అవేకాకుండా డబుల్ కా మీఠా, కుర్బానీ కా మీఠా, కోవా నాన్, మిఠాయిలు లేనిదే పండుగ పూర్తిగా కాదు.

మహా నగర తీరాల్లో...

చెన్నైలో రంజాన్ నెల మొత్తం రోజా పండుగలాగా జరుపుకుంటారు. రోజా ముగిసేసరికి వీధుల్లోని స్టాల్స్ అన్నీ జనాలతో కిక్కిరిసిపోతాయి. ఇక్కడ కట్‌లెట్స్, చికెన్ పఫ్స్, గాజ్రా, కీమా సమోసా, ఫదీర్ పేనీ ముఖ్యమైన వంటకాలు. బిర్యానీ ప్రత్యేకం. వల్లాహ్ మసీదు దగ్గరలోని ఆఫ్రీన్ జ్యూస్ షాపుల్లో ప్రత్యేకమైన చికెన్ పఫ్స్ దొరుకుతాయి. వేడి వేడి చికెన్



కర్జూరాలే కామన్



రంజాన్‌లో కర్జూరాల్ని తీసుకోవడం చాలా కామన్. మనకైతే ఇరాన్ నుంచి కూడా ప్రత్యేకంగా తెప్పించుకుంటారు. గింజలేని కర్జూరాల్ని కాస్త డబ్బున్నోళ్లు కొనడం ఎక్కువైంది. ఈ ఒక్క పండు తప్పితే మిగతా విందుల్లో చాలా తేడాల్నే మనం చూడొచ్చు. స్థానిక పరిస్థితులకు, అందుబాటుకు తగ్గట్టు అక్కడి ఆహారవ్యవహారాల్లోను మార్పు వస్తుంది. రంజాన్ సందర్భంగా తీసుకునే ఆహారంలోను ఈ మార్పే వేర్వేరు దేశాల్లో మనం చూడొచ్చు. మొరాకోలో తృణ ధాన్యాల సూప్‌ల్ని తీసుకుంటే ఇండోనేషియాలో కొలాట్ అనే పళ్ల డెసెర్ట్‌ను, కెటుపాట్ అనే కొబ్బరి అన్నాన్ని ఆరగిస్తారు. పాకిస్తాన్‌లో సమోసా, చోలేలకు గిరాకీ ఎక్కువుంటే చైనాలో ఎగ్ రోల్స్‌ను తిని మిగతా విందులోకి వెళతారు. ఉత్తర అమెరికాలో అయితే మీట్ బాల్స్ ఫేవరె ట్‌లలో ఒకటి. సాధారణంగా కాక వీటిల్లో వేరే మాంసంతో వండుకుంటారు. ఇటాలియన్ ముస్లింలకు పాస్తా ఉండి తీరాల్సిందే. సోమాలియాలో కర్రీ పఫ్‌లు, ఇథియోపియాలో డోరో వాత్ అనే చికెన్ స్ట్యూకు డిమాండ్ ఎక్కువ. మన దేశంలోనే కాదు చాలా దేశాల్లో బిర్యానీ ఫేవరెట్. అలాగే హలీమ్‌ను మధ్య ప్రాచ్య దేశాలు, మధ్య ఆసియా దేశాలలో రకరకాల రుచుల్లో చేస్తారు. టర్కీలోని కెస్కెక్ హలీమ్ ఓ ఫ్లేవర్‌లో ఉంటే ఇరాన్, అజెర్‌బైజాన్, ఉత్తర ఇరాక్, అరబ్ ప్రపంచంలోని హరిస్సాలో వేర్వేరు రుచుల్లో ఉంటాయి. అర్మేనియా హలీమ్‌ది, పాకిస్తాన్‌లోని ఖిచ్రా హలీమ్‌ది ప్రత్యేకమైన రుచే. ఒట్టొమాన్ దేశాల్లో ముఖ్యంగా టర్కీలో పాస్తిర్మా అనే వంటకం యాంటోలియన్ వంటశాలల నుంచి వచ్చింది. బల్కన్ దేశాల్లో కోఫ్తా టాప్. అరబ్ ఖతాయెఫ్‌లు బాగా పాపులర్ అయ్యాయి. పాలస్తీనాలో కునాఫా అనే పేస్ట్రీ పసందు చేసు కుంటారు. ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఈద్ అల్ ఫిత్ర్‌ను పిలుస్తారు. పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో కొరైట్ అంటే ఇండోనేషియాలో లెబారన్ అంటారు.

సమోసాలతో పాటు చాయ్ తాగుతూ బీచ్‌లోని ఆహ్లాదాన్ని అందరితో పంచుకుంటారు. కీమా వడలు కూడా ప్రత్యేకం. చిల్లీ బజ్జీ, ఉల్లి గారెలతో పాటు నుంబు గంజి (కందిపప్పు, బియ్యపు పిండితో చేసిన ప్రత్యేకమైన వంటకం). తమిళ ప్రజలు ఈ రుచులను ఎక్కువగా ఆస్వాదిస్తారు.

ముంబైలో ప్రతి ఒక్కరు రంజాన్ అనగానే మహ్మద్ ఆలీ రోడ్డు వైపే చూస్తారు. భారా హందీ (చపాతీతో కూడిన వంటకం) ఇక్కడ చాలా ప్రసిద్ధి. దీనితో పాటు మేక, పొట్టేలు కాళ్ళ పాయా, లంబాపావ్, ప్రత్యేకమైనవి. ఇక్కడికి దగ్గరల్లోని మసీదు రోడ్డులో పొట్టేలుతో చేసిన వంటలు, ఐస్ క్రీములు ఎక్కువగా దొరుకుతాయి. ఇఫ్తార్ విందులో ఇవి ప్రత్యేకం.

హలీమే కాదు లస్సీ కూడా...

హైదరాబాద్ అనగానే ముందుగా గుర్తుకొచ్చేది ముందుగా బిర్యానీ, హలీమ్. ఇక్కడ పెద్ద మొత్తంలో చేతితో తయారుచేసిన సేమియాలు అమ్ముతూ ఉంటారు. వీటిని పెద్దపెద్ద ఉండలుగా చేసి మార్కెట్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతారు. వీటితో కీర్ చేసుకుని అందరికీ పంచి ఇంటిల్లిపాది తిని ఆనందిస్తారు. ఈ సేమియాలను ఎక్కువ రోజులు నిల్వచేసుకోవడానికి వీలుగా కొంచెం వేయించి ఉంచుతారు. హైదరాబాద్‌లోని గుల్జార్ హౌస్‌లో ఈ సేమియా ప్రత్యేకం. పాతబస్తీలోకి వెళితే లస్సీ రారమ్మని పిలుస్తుంది. లస్సీలో డ్రై ఫ్రూట్స్, మలై కోవా వేస్తారు. ఈ లస్సీని ఎక్కువ మంది ఎంతో ఇష్టంగా తాగుతుంటారు. హలీమ్, బిర్యానీ పెద్ద పాత్రల్లో వేసి నిరంతరం వండుతూనే ఉంటారు. ఈ వీధుల్లో ఎక్కడ వున్నా ఈ కమ్మటి వాసన పిలుస్తుంటుంది.

గంజి ప్రత్యేకమే

రంజాన్ మాసం వచ్చిందంటే ముస్లిం సోదరులు మసీదుల వద్ద గంజి తయారుచేసి ఉచిత రీతిన పంపిణీ చేయడం పరిపాటి. ప్రత్యేకమైన ఈ గంజి తయారీకి బియ్యం రవ్వ, మినప పప్పు, కొత్తిమీర, పచ్చిమిర్చి, ఎండుమిర్చి, ఉల్లి, అల్లం మిర్చిపేస్టు, కొబ్బరి పేస్టు, కరివేపాకు, మటన్ కైమా కొద్దిగా వేసి తయారు చేస్తారు. ఈ గంజి తయారీ విధానం కూడా దాదాపుగా రెండు నుండి మూడు గంటల సేపు సాగుతుందని తయారీదారులు తెలిపారు. ముందుగా నీటిని మరిగిపోయేలా వేడి చేసి దానిలో బియ్యం రవ్వ వేసి కలియ తిప్పుతారు. దానిలో వేయించిన ఉల్లిపాయ ముక్కల పేస్టును కలుపుతారు. ఆ తర్వాత మినప పప్పు పొడి రూపంలోనూ, మటన్ కైమా, అల్లం, మిర్చి పేస్టులు, కొత్తిమీర, కరివేపాకు వేయించి బాగా మరిగిస్తారు. చివరిగా గంజిని ధమ్ చేసి అనంతరం పంపిణీ చేస్తారు. ఈ గంజి శక్తినిచ్చే పానీయం. ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలు ఎక్కువగా ఇష్ట పడతారు. సాయంత్రం దీక్ష విరమణ సమయంలో గంజి స్వీకరిస్తారు. ఇళ్లలో ఉండే మహిళలు గంజిని మసీదుల వద్ద పంపిణీ సమయంలో పిల్లలు, పెద్దలు చేత తెప్పించుకుని దీక్షలు విరమించిన తర్వాత స్వీకరిస్తారు. చలువనిచ్చే పానీయంగా సైతం గంజిని చెపుతారు. ఈ గంజిలో రుచి కోసం బూందీ వంటి వాటిని వేసుకుని తీసుకుంటారు. ఈ గంజిని ఒక్క ముస్లింలే కాకుండా రంజాన్ మాసంలో మిగతావారూ ఇష్ట పూర్వకంగా తీసుకుంటారు.

హలీం...హలీం



హలీం ఒక ఇరానీ వంటకం... రంజాన్ మాసంలోనే ప్రత్యేకంగా లభించే ఈ వంటకం దక్షిణ భారత దేశంలో హైదరాబాద్‌లోని పాతబస్తీలోనే లభించేది. ఇరానీ వంట సుప్రసిద్ధులను తీసుకువచ్చి రంజాన్ మాసంలో ఇక్కడ తయారు చేయించేవారు. సరికొత్త రుచిలో తక్షణ శక్తినిచ్చే వంటకంగా, రుచిగా ఉండే ఈ హలీంను తీసుకునేందుకు ముస్లిం సోదరులే కాకుండా ఇతర ప్రజలు కూడా ఉత్సుకత కనపరిచేవారు. విజయవాడ నగరంలో దాదాపుగా 10 సంవత్సరాల నుండి ఈ హలీంను వ్యాపారులు అందుబాటులో ఉంచుతున్నారు. హైదరాబాద్ పాతబస్తీ తరహాలోనే విజయవాడ పంజాసెంటరులో హలీం స్టాళ్లను ఏర్పాటు చేసి రంజాన్ మాసంలో హలీంను తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. గతంలో ఒకటి రెండు స్టాళ్లుగా నడిచే ఈ హలీం అమ్మకాలు నేడు 15 స్టాళ్లకు పైగా చేరాయి. రోజుకు ఒక్కో స్టాల్‌లో రూ.లక్ష వరకు వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు చెప్తున్నారు. హలీం ప్రియులకు రంజాన్ మాసంలోనే ఈ వంటకం లభిస్తుండటంతో స్టాళ్లన్నీ సాయంత్రమైతే చాలు కిటకిటలాడుతుంటాయి.

బలవర్ధకమైన హలీం తయారీ విధానం చాలా కష్టతరంతో కూడిన పని. హలీం తయారీకి మటన్, కాజుపిస్తా, బాదం, జాపత్రి వంటి వాటితో పాటుగా ప్రాచీన వనమూలికలు వంటివి మొత్తంగా 33 రకాల వన మూలికలు జోడించి తయారు చేస్తుంటారు. అందుకే హలీం బలవర్ధకమైన ఆహారమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారంగా చెప్తుంటారు.

ఉదయం 5 గంటల సమయం నుండి తయారీ మొదలు పెట్టి మాంసాన్ని ఉడికించి దానిలో ఔషధ మూలికలు జోడించి దీన్ని సాయంత్ర సమయానికి సిద్ధం చేసి వ్యాపారులు అమ్మకాలు చేస్తుంటారు. తయారీకి సైతం సుప్రసిద్ధలైన వంట మేస్త్రీలను ఉపయోగిస్తారు. ముస్లిం సోదరులు ఉపవాస దీక్ష విరమించిన తర్వాత ప్రతి రోజూ హలీం తీసుకోవడం పరిపాటి. హలీం తక్షణ శక్తినిచ్చేది మాత్రమే కాకుండా పోషక విలువలతో కూడిన పదార్థం కావడంతో ముస్లిం సోదరులే కాకుండా ఇతర మతస్తులు సైతం ఈ వంటకాన్ని తీసుకునేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. ఆసక్తి కనపరుస్తారు. ఇష్ట పడతారు. చాలావరకు ఇక్కడ మటన్, ప్యూర్ నెయ్యితో చేసిన హలీం మాత్రమే లభిస్తుంది. చికెన్ హలీం తక్కువ. హలీంతో పాటుగా స్టాల్స్‌లో రోటీ రుమాలీ, ఫాలుదా, చికెన్ టిక్కా, ధమ్ చికెన్, చికెన్ పాయ, లెగ్‌పీస్ లు వంటివి లభిస్తాయని .. రంజాన్ మాసంలోనే హలీంతో పాటుగా ఫలుదా కూడా ప్రత్యేక పానీయం గా ఉంటుందన్నారు. చలువ చేసే సబ్జాలు, ఐస్ క్రీం, పాలు వంటి వాటితో దీన్ని తయారు చేస్తారు.

స్టయిల్‌తో అమ్మేస్తున్నాడు

బ్రెజిల్‌లో ఓ వీధి అమ్మకందారుడైన ఎయిల్టన్ మాన్యూల్ ద సిల్వాకు 'ట్రాఫిక్ వెయిటర్' అనే పేరుంది. ట్రాఫిక్ సిగ్నళ్ల దగ్గర ఓ ట్రేలో స్నాక్స్ అమ్ముకునే అతనో సెలబ్రిటీ కూడా. నీటుగా టక్ చేసుకుని, టై కట్టుకుని, కళ్లద్దాలు పెట్టి, నెత్తిన హ్యాట్, పాదాలకు తోలు బూట్లతో చాలా మర్యాదగా కనిపిస్తాడు. అలానే వినియోగదారుల్ని మర్యాదగా పలకరిస్తాడు. ఈ రెండూ అక్కడ కొత్త పోకడ. సాధారణంగా వీధి అమ్మకందార్లు తమ దగ్గర వస్తువులు కొనేంత వరకు సతాయిస్తూ ఉంటారనే అభిప్రాయం అక్కడుంది. ట్రాఫిక్‌లో ఇబ్బంది పడిపోతుంటే వీరిదో గొడవ అని కారు అద్దాలు కూడా కిందకు దించరు. ఈ విషయాల్నే జాగ్రత్తగా పరిశీలించి చాలా హుందాగా ట్రాఫిక్ సిగ్నల్ పడినపుడు వాహనాల ఆపినవారిని పలకరిస్తాడు. కొన్నా కొనకున్నా నవ్వుతూ గ్రీట్ చేస్తాడు. అది కూడా ఓ స్టయిల్‌లో. అంతే కస్టమర్లు పడిపోయారు. ఉదయం 7 గంటల కల్లా రోడ్డు వద్దకు వచ్చేసి రాత్రి 10 గంటలకు పైగానే ఉంటాడు. ఇలా సంపాదించిన డబ్బుతో తన భార్య ముగ్గురు బిడ్డలు కడుపు నింపడమే కాక స్థానికంగా ఉండే ఓ వృద్ధాశ్రమానికి కూడా విరాళాలు అందిస్తుంటాడు. ఒకప్పుడు లక్క పని చేస్తూ ఆ తర్వాత 43 ఏళ్ల వయస్సులో పని కోల్పోయిన ఎయిల్టన్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. మిగతా వృత్తుల్ని ఆ వయస్సులో నేర్చుకోవడం కష్టమనిపించింది. అందుకే ఇలా నెట్టుకొస్తూనే భార్యను చదివిస్తున్నాడు. ఆమె డిగ్రీ పట్టా పొందాక తాను కూడా చదవాలనే సంకల్పమూ ఉంది. చదువుకుంటే ఉద్యోగం త్వరగా దొరుకుతుందని. ఎయిల్టన్ ఫీల్డ్‌లోకి దిగి రెండేళ్లు కాలేదు తన స్టయిల్‌తే అదరగొట్టేస్తున్నాడని తోటి అమ్మకందార్లు కుళ్లుకుంటుంటారు. వాళ్లనీ నవ్వుతూనే పలకరిస్తాడు ఈ మర్యాద మనిషి.

నకిలీ రాజకుమారుడు

మోంటెనీగ్రో రాజ వంశానికి చెందినవాడినని చెప్పుకుంటూ హాలీవుడ్ స్టార్ల నుంచి విదేశీ రాజ వంశీయుల వరకు అందర్నీ బురిడీ కొట్టించాడు ఇటలీకి చెందిన 57 ఏళ్ల స్టెఫాన్ సెర్నెటిక్. మోంటెనీగ్రోనే కాదు సెర్బియా, అల్బేనియా రాజ్యాల్ని కూడా పాలించిన ఒకప్పటి రాజ వంశం తనదని బీరాలు పలికాడు. రోమన్ సామ్రాజ్యపతి కాన్‌స్టాంటిన్ వారసుడినని ప్రచారం చేశాడు. దీనికి సాక్ష్యంగా నకిలీ రాజ ముద్రలు చూపించాడు. నల్ల మెర్సిడెస్‌లో మోంటెనీగ్రో జెండా పెట్టుకుని విలాసంగా వెళ్లే ఇతన్ని చూసి చాలామంది రాజ మర్యాదలు చేశారు. యూరప్‌ను చుట్టొచ్చినప్పుడు చాలా లగ్జరీ హోటళ్లలో ఉచితంగా సేద తీరాడు కూడా. మొనాకో రాజకుమారుడు ప్రిన్స్ అల్బర్ట్‌తో కలసి విందు ఆరగించాడు. గ్రీస్, డెన్మార్క్‌ల యువరాణి ఐరీన్‌తో కలసి టేబుల్ పంచుకున్నాడు. వాటికన్ బిషప్‌ల్ని మర్యాదపూర్వకంగా కలిశాడు. ఇటలీ టౌన్ మోనోవలీ మేయర్ మనోడి పేరిటే ఓ విందు ఏర్పాటు చేసేశారు. పమేలా ఆండర్సన్ లాంటి వాళ్లకు మనోడు 'కౌంటెస్', 'నైట్‌హుడ్'లు కూడా ఇచ్చేశాడు. డబ్బు చెల్లించి మరీ అతిథిగా పిలిచే ఇలైట్ క్లాసు కూడా అక్కడ ఉంది. ఇలా అనేక మర్యాదలు పొందిన తర్వాత మనోడి వాలకం మీద ఇటలీ పోలీసులకు అనుమానం కలిగింది. ఏడాదిపాటు విచారించాక నకిలీ అని తేలిపోయింది. రాజవంశాలతో ఎటువంటి లింక్ లేకపోవడంతో స్టెఫాన్ ఖేల్ ఖతం.. దుకాణ్ బంధ్ అయిపోయింది. ఒకప్పుడు తన పేరు మీదే ప్రత్యేక వైన్ ఉంటే ఇప్పుడు కాస్త ఇబ్బందిగానే ఉంది ప్రాణానికి. అందుకేనేమో తెల్ల తోలు నెత్తిన హ్యాట్‌తో వచ్చేసే చాలామందికి మనోళ్లు రాచమర్యాదలు చేసేసి ఉప్పొంగిపోతుంటారు. ఫలానా దేశపు దొరబాబులని ప్రాజెక్టుల్ని అప్పజెప్పేస్తుంటారు.

వింత లోకం

ఎండతో చికెన్

మనకు బొంగులో చికెన్ గురించి బాగా తెలుసు. నూనె, నీళ్ల కలపకుండా వెదురు బొంగులో ఘుమఘుమలాడే చికెన్ వండి వార్చేస్తారు. అలాగే ఎండతో చికెన్ కూడా ఉంది తెలుసా. థాయ్‌ల్యాండ్‌లోని ఫెట్చాబురీలో ఈ చికెన్ రోస్ట్ దొరుకుతుంది. సిలా సుథారత్ అనే వంటాయన చికెన్‌ను దాదాపు భూతద్దం ప్రయోగంతో ఎండలో ఉడికించేస్తాడు. కదిలే 1000 అద్దాల్ని వాడి వీటన్నింటి నుంచి పరావర్తనమయ్యే కాంతిని చికెన్ మీద కేంద్రీకరించి ఇలా రోస్ట్ చేసేస్తుంటాడు. దాదాపు 300 డిగ్రీల పైనే వేడి పుడుతుందట. అంతకు ముందు అందరిలానే పొయ్యి మీదే వండేవాడు. 1997లో ఓ చిన్న విషయం మనోడి వంట స్టయిల్‌ని అమాంతం మార్చేసింది. వీధిలో నడుస్తూ వెళుతుండగా ఓ బస్ అద్దం నుంచి పరావర్తనమైన కాంతి బుగ్గను చురుమనిపించిందట. అరే ఇలా వేడిని ఎందుకు మరింత పుట్టించి వంట చేయకూడదు గ్యాస్ ఖర్చులు కలిసొస్తాయని అనుకున్నాడు. తొలుత అందరూ ఇతగాడి ఆలోచన చూసి నవ్వారు కానీ తర్వాత కేజీన్నర చికెన్‌ను పది పదిహేను నిమిషాల్లో రోస్ట్ చేసేస్తుంటే చూసి ఆశ్చర్యపోయారు. రుచి చూసి లొట్టలేసుకున్నారు. మరి చికెన్‌ను పక్కకు తిప్పేపుడు మనోడికీ కాలుతుంది కదా అంటే దాని కోసం ప్రత్యేకమైన గ్లౌజులు, వెల్డర్ మాస్క్ గట్రా తగిలించుకునే పనిచేస్తాడులెండి. ఈ క్రేజీ చికెన్ రోస్ట్‌కు కస్టమర్లు పెరగడమే కాదు మరో గౌరవం కూడా దక్కింది. ఫెట్చాబురి రాజభట్ విశ్వవిద్యాలయం మనోడి తెలివికి గౌరవ శాస్త్ర పురస్కారం కూడా ఇచ్చింది. రోస్ట్ టేస్ట్ అదిరిపోలా..!



హ్యాకథాన్ వీరుడు

కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో మారథాన్ లాంటిది హ్యాకథాన్ ఈవెంట్. ఈ పోటీల్లో ఒక కుర్రాడు అద్భుతాల్ని చేస్తున్నాడు. ఇండియా హ్యాకథాన్‌కు మారుపేరుగా అయ్యేంత ప్రతిభతో అందర్నీ ఆలోచనలో పడేస్తు న్నాడు. ఐఐటీల్లో చదవకున్నా హ్యాకథాన్‌లో ఒకే ఒక్కడుగా నిలుస్తున్న పల్లె కుర్రాడు రవి సుహాగ్‌కు చెందిన స్ఫూర్తి కథ ఇది.

నాలుగేళ్లలో దేశంలో హ్యాకథాన్ ఈవెంట్ల సందడి పెరిగింది. అలాంటి 16 దేశవాళీ పోటీల్లో పాల్గొన్న రవి 14 ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. అతడి సక్సెస్ రేట్ 88 శాతం. ఈ వివరాలు వింటే అతడేదో పెద్ద చదువో లేదా ఐఐటీ విద్యార్థో అయ్యి ఉంటాడని అనుకుంటారు కానీ రవి నేపథ్యం వింటే ఆశ్చర్యపోతారు. సగం చదువును తన మాతృభాష హిందీ మాధ్యమంలోనే చదివిన హర్యానా కుర్రాడు రవి సుహాగ్. రవి తండ్రి ఓ వ్యవసాయదారుడు. కంప్యూటర్‌ను ఇంటికి తెచ్చింది తన విజయాల ద్వారానే. సాదాసీదాగా జరిగిపోతున్న రవి బాల్యాన్ని ఎలక్ట్రానిక్స్ ప్రపంచం ఆకట్టుకుంది ఏడో తరగతి చదువుతున్నపుడే. ఎఫ్ఎం, టేప్ రికార్డర్ కలిసిన ఓ రేడియో తండ్రి ఇంటికి తెచ్చినప్పుడు రవికి నిద్రే పట్టలేదు. అసలెలా అది పనిచేస్తుందనే అనుమానం దాన్ని బద్దలుగొట్టి చూసిందాకా ఊరుకోనివ్వలేదు. తీరా పగలకొట్టాక దాన్ని తిరిగి రిపేరు చేయడం ఎలానో రవికి తెలీదు. తండ్రి ఏమంటాడో అనే భయంతో ఆ తర్వాత కొన్ని రోజులు నిద్ర పట్టలేదు. అందుకే నిద్రాహారాలు వదిలేసి రేడియో గురించి తెలుసుకున్నాడు. దాన్నెలా రిపేరు చేయాలనే విషయాన్ని నేర్చుకునేందుకు నెలలు గడిపాడు. ఆ తర్వాత దాన్ని పూర్తిగా బాగు చేసి తండ్రికి చూపించాక గానీ నిద్ర సరిగా రాలేదు. 9వ తరగతిలో ఆంగ్ల మాధ్యమంలోకి మారాడు రవి. కొన్ని మాసాలు ఇంగ్లిష్‌ను వంటబట్టించుకోవడానికే సరిపోయింది. కానీ అప్పటికీ కంప్యూటర్ రవికి పరిచయమవ్వలేదు. కంప్యూటర్ పాఠశాలలో లేదు. దాన్ని నేర్చుకోవడం ఎలా? 12వ తరగతిలో కంప్యూటర్ శిక్షణకు వెళ్లినా నేర్చుకుంది ఎంఎస్ పెయింటే. మరి తనేమో ఐఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కలలు కన్నాడు. వాటి కోసం మళ్లీ నిద్ర మానుకున్నాడు. తన ఊళ్లో కరెంట్ కష్టాలెక్కువే. కొవ్వొత్తి వెలుగులో చదివిన సందర్భాలూ ఎక్కువే. అందుకే ఊరి విడిచి పట్నంలో షేర్ రూమ్‌లోకి మారాడు. రవి ఆసక్తి కష్టం చూసి కచ్చితంగా పోటీ పరీక్షల్లో టాప్ లేపేస్తాడనుకున్నారు అంతా. పరీక్ష రోజు ఒత్తిడి వల్లో మరే విషయం వల్లో చదివినదంతా మర్చిపోయిన భావనకు గురయ్యాడు. మైండ్ బ్లాంక్ అయిపోయింది. పెన్ను కదలలేదు. జవాబు నోట్లోనే, బుర్రలోనే తచ్చాడుతుంది కానీ బయట పడలేదు. అంతే ఐఐటీ ఎంట్రన్స్ తప్పాడు. ఆ షాక్ నుంచి బయటపడటానికి చాలా రోజులే పట్టింది. అప్పుడూ నిద్ర రాలేదు. టాప్ 100 కళాశాలల జాబితాలో లేని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో

అనాసక్తిగానే చేరాడు. కానీ గురుగ్రామ్‌లోని ఆ కాలేజీయే అతడి కలల్ని మళ్లీ పెద్దవి చేసింది. విద్యార్థుల్లో చాలా చురుగ్గా ఉండే రవికి అధ్యాపక బృందం అండదండలందాయి. ఈసారి పరీక్ష రోజు భయం పోయి మంచి గ్రేడ్‌లు సంపాదించు కున్నాడు. అతడి ప్రతిభ గురించి తెలిసిన సాటి విద్యార్థులు క్లాసులు చెప్పించుకునేవాళ్లు. అలా చెప్పగా వచ్చిన డబ్బుతో ఓ కన్సల్టింగ్ కంపెనీ 'ఇన్సిపిరేషన్ ఎడ్జ్'ను చదువుకుంటున్న రోజుల్లోనే ప్రారంభించాడు. కళాశాల గ్రంథాలయం నుంచి పుస్తకాలను తెచ్చుకుని కోడింగ్, డిజైన్ నైపుణ్యాన్ని పెంచుకున్నాడు. అతడి ప్రతిభకు హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఓ గొప్ప అవకాశం దక్కింది. గ్రామీణ మంత్రిత్వ శాఖలకు ఉపయోగపడేలా డిజిటల్ పేమెంట్లకు సంబంధించిన పాలసీ డిజైన్‌కు కన్సల్టెంట్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. అలాగే గో-జెక్ అనే రైడ్ హైలింగ్ ప్లాట్‌ఫార్మ్‌కు కూడా పనిచేస్తున్నాడు.

పోటీలో ఒక్కడు

2013లో వెబ్ డెవలపర్‌గా పనిచేస్తున్నపుడు తొలిసారి హ్యాకథాన్ గురించి విన్నాడు. ఆ ఏడాది జూలైలో అలాంటి ఓ ఈవెంట్‌లో పాల్గొని కోడింగ్ ప్రపంచానికి పరిచయమయ్యాడు. ఆ తర్వాత ఒక్కో హ్యాక్‌థాన్‌ను గెలుస్తూ భారత్‌లో ఆ పోటీల్లో తిరుగులేనివాడిగా పేరు సంపాదించాడు. జాతీయ స్మారక చిహ్నాల్ని సందర్శించేందుకు వెబ్ ప్లాట్‌ఫార్మ్, మొబైల్ యాప్‌లతో డిజిటైజ్డ్ ఎంట్రీ కోసం పనిచేసి రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకున్నాడు. తండ్రికి ఈ విషయం తెలిసినపుడు ఆ అవార్డు కూడా హ్యాకథాన్‌కే వచ్చిందనుకున్నాడట. ప్రతి రెండు నెలలకు అలాంటిది గెలుస్తున్నాడుగా అందులో కొత్తేముందని తేలిగ్గా తీసుకుని ఆ తర్వాత అసలు విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. ఐఐటీలాంటి పెద్ద విద్యాసంస్థల్లోనే చదివితేనే భవితేం కాదు చిన్న కళాశాలల్లోను చదివి అద్భుతాలు చేయొచ్చు అందుకు తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం, దృఢ సంకల్పం, పోరాటం ఉంటే చాలని రవి సుహాగ్ నమ్ముతున్నాడు. నమ్మడమే కాదు అది నిజమని తన విజయ కథతో నిరూపించాడు. ఐఐటీలో సీట్ రాలేదా? ఏం పర్లేదు మీలో సబ్జెక్ట్ ఉంటే చాలు... అది నమ్మితే రవి సుహాగ్‌లాంటి చాలామంది మనకు ఇంకా పరిచయమవుతూనే ఉంటారు. ఆల్ ది బెస్ట్ ఫ్యూచర్ ఇంజినీర్స్.

అపాత చిత్రం



మౌన ప్రేమల కథ

తెలుగు సినిమా తలెత్తుకు తిరిగే రోజులు.... తీసిన ప్రతి సినిమా శతదినోత్సవాలూ... రజతోత్సవాలూ జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. అటువంటి సమయంలో వజ్రోత్సవం జరుపుకున్న చిత్రం మూగమనసులు. పౌరాణిక, జానపద చిత్రాలకు తనదైనమార్కువేసుకొని విజయం సాధించింది. యల్.వి. ప్రసాద్ గారి తర్వాత జనరంజకంగా సినిమాని తీర్చిదిద్దడంలో ఆదుర్తి సుబ్బారావుని అగ్రగణ్యుడిగా చెప్పుకోవాలి. ఆదుర్తి నవరసాల్నీ అద్భుతంగా పండించగలడు. ముఖ్యంగా పాత్రల నడుమ భావోద్వేగాల్ని తెరమీద చూపించడంలో మంచి పట్టున్న దర్శకుడు. అందుకే ఆయన దర్శకత్వం వహించిన సినిమాలు తెలుగు సినిమా స్వర్ణయుగపు సౌరభాల్ని వెదజల్లాయి. అందులో మేటి చిత్రం 'మూగమనసులు'.

'బాబూ మూవీస్' ప్రతిష్ఠాత్మక సంస్థ. సి.సుందరం, ఆదుర్తి, ఆత్రేయ, కె.వి.మహదేవన్ ఈ నలుగురూ బాబూ మూవీస్‌కి నాలుగు స్తంభాలు! ఈ నలుగురూ... ఈ సంస్థ పేరు ప్రతిష్ఠల్ని పెంచేందుకు శక్తివంచన లేకుండా పనిచేశారు. వీరి తొలి చిత్రం 'మూగమనసులు'. అప్పట్లో ఒక వార్త సంచలనం సృష్టించింది. కొన్ని అంశాలు ఆసక్తికరమైన వార్తలు ప్రధానంగా చోటుచేసుకున్నాయి. దీనిమీద మంచి కథ అల్లుకోలేమా? అన్న ఆలోచన వచ్చింది. రావడమే తడవుగా తన ఆత్మీయ మిత్రుడు ఆత్రేయతో పంచుకున్నాడు. ఆత్రేయకి ఈ లైను బాగా నచ్చింది. ఆత్రేయ ఆశాజీవి. కొత్త ఆలోచనకూ...సరికొత్త భావాలకూ స్వాగతం పలికేవ్యక్తి. అయితే ఇటువంటి కథల్ని హ్యాండిల్ చేస్తున్నప్పుడు ...సాంకేతిక నిపుణుల సహకారం ఎంత అవసరమో...నటీనటుల ప్రతిభా అంతే అవసరం! అక్కినేని సావిత్రిలతో సంప్రదించారు. ఆత్రేయలో ఓ గొప్పదనముంది. తను స్వతహాగా రంగస్థలం నేపథ్యంలోంచి వచ్చినవాడు గనుక ఎంతటి గొప్ప ఆర్టిస్టునైనా....అయిదు నిమిషాల్లో ఒకలైను చెప్పి ఒప్పించేయగలడు. అగ్ర నటీనటులు సావిత్రి అక్కినేని ఆత్రేయ చెప్పిన లైను విని అద్భుతంగా ఫీలయ్యారు.

కథ తీరు

ఆత్రేయ, ఆదుర్తి, ముళ్ళపూడి వెంకటరమణ, కె.వి మహదేవన్‌లు కథ మీద కూర్చున్నారు. ఈ సినిమాకి కె.విశ్వనాథ్ సహాయ దర్శకుడు. మరో సహాయ దర్శకుడు టి.కృష్ణ. ఇతను తర్వాతి కాలంలో శోభన్‌బాబుతో 'ఖైదీబాబాయ్' చిత్రాన్ని తీసి సంచలన విజయం సాధించాడు. అప్పట్లో ఆదుర్తికి ఎడిటింగ్ శాఖలో సహాయకుడిగా పనిచేశాడు. వీరిద్దరూ కథా

చర్చల్లో కూర్చున్నారు. ఎలా క[...] ముగించాలి? నాలుగైదు వెర్షన్ల[...] బాగున్నాయిగానీ ఈ జన్మల గొ[...] ప్రేక్షకులు ఎంతవరకూ రిసీవ్ చే[...] అయినా సినిమా ఫెయిలవుతుం[...] మాట్లాడాలి. మరింత తీయని [...] పాటలు పాడుకోవాలి. థియేటర్[...] ప్రేక్షకుడికి కలకాలం గుర్తిండిపో[...] పంచాలి. ఆదుర్తి చొరవ తీసుకొ[...] బంధమేనాటిదో... ఏనాడు పెన[...] వుండాలి. టేకాఫ్ బాగుండాలి. [...] సినిమా సాఫీగా, హ్యాపీగా సాగి[...] మాట్లాడుతుండగానే ఆత్రేయ పాట పూర్తిచేశాడు. తర్వాత సందర్భాల గురించి చర్చ వచ్చినప్పుడల్లా ఆత్రేయ ఆశువుగా కవితలల్లేవారు.
అటువంటి మరో పాటపాడుతూ తీయగా చల్లగా..'పసిపాపలా నిదురపో తల్లిగా' పాట సిద్ధమయ్యింది. ముళ్ళపూడి వారి పనితనం జమున పాత్ర రూపకల్పనలోనూ, చిలిపితనంతో కూడిన కరుణరస సన్నివేశాల్లోనూ పనిచేసింది. కథ సిద్ధమయ్యింది. ఆదుర్తి తీయగా నిట్టూర్చారు. మూగమనసులు క[...] అద్భుతంగా వచ్చింది.

ఆత్రేయ-మహదేవన్‌లే...

సినిమా స్థాయి ఎంతటిదైనా[...] బహుళ ప్రాచుర్యం పొందాలి. అ[...] అంతగాలేదు. పాటలు, సినిమా రికార్డులు ప్రచార సాధనాలుగా గుండెపొరల్లోంచి వచ్చినవే పాట[...] అందించిన సుస్వర మాధురీ ఈ[...] అదే అనుభూతి....అదే మాధుర్[...]

'ఈ నాటి ఈ బంధం ఏనా[...] ముడివేసెనో', 'ముద్దబంతిపువ్వు[...] పాట నీనోట పలకాల చిలకా.... చల్లగా...పసిపాపలా నిదురపో [...] 'ముక్కుమీద కోపం నీ ముఖానికే[...] కాను....రాయీ రప్పను కానే కా[...] నీ మనిషిని నేను...' ఈ పాటల[...] అన్నిపాటలూ సందర్భాల్లోంచి పు[...] పాత్రలు...అంటే హీరో హీరోయి[...] పాటలే తదుపరి 'గోదారిగట్టుంది[...] దాశరథి రామారావు, 'గౌరమ్మా-[...] కొసరాజు రాశారు. ఈ పాటలన్నీ[...] మార్మోగిపోయాయి. సినిమా విజ[...] సహాయపడ్డాయి. సినిమాలో పా[...] సినిమా సగం విజయవంతమైనట[...] తీర్చిదిద్దితే! ఆ సినిమా శతదినోత[...]

ని మొదలుపెట్టాలి? ఎలా
అనుకున్నారు. అన్ని వెర్షన్లూ
వేంటి? ఈ జన్మల అనుభూతుల్ని
సుకోగలరు? ఏ మాత్రం కన్ఫ్యూజ్
ి. 'మూగమనసులు' తీయగా
నుభూతుల్ని పంచాలి. తీయని
నుంచి బయటికి వచ్చిన
యే తీయని అనుభూతుల్ని
... 'ఈ నాటి ఈ
వేసి ముడివేసెనో....' అనేలా
సినిమా ఎత్తుగడ బాగుంటే ఇక
ోతుంది' అని అన్నారు ఆదుర్తి.

ఫ

అది ముందు జనంలోకి వెళ్లాలి.
పుల్లో మీడియా సపోర్ట్
హిట్ అయితే మాటలూ. ఎల్.పి
ుపయోగపడుతుండేది. ఆత్రేయ
న్నీ. ఆ పాటలకు మహదేవన్
నాటికీ నిత్యనూతనంగా వుంది.
!
దో....ఏ నాడు పెనవేసి
మూగకళ్ల వూసులూ...', 'నా
'పాడుతా తీయగా
ల్లిగా బంగారు తల్లిగా...
అందం', 'మానూ మాకును
...మామూలు మనిషిని నేను...
ఆత్రేయ విరచితమే!
ట్టుకొచ్చినవే....అన్ని పాటలూ
మూగమనసులు పాడుకొనే
...గట్టుమీదా చెట్టుంది...' పాట
మొగుడెవరమ్మా...' పాట
ఆ రోజుల్లో పెళ్ళిపందిళ్ళలో
యానికి పదింతలు
లు ప్రేక్షకులకి బాగా నచ్చాయి.
ఇక సినిమా విజయవంతంగా
వాలూ... రజతోత్సవాలూ గోల్డెన్

జూబ్లీలూ...ఇలా ఆడితీరవలసిందే! మూగమనసులు సినిమా వజ్రోత్సవ వేడుకలు జరుపుకున్న ప్రతిష్ఠాత్మకమైన సినిమా! అందులో సింహభాగం ఆత్రేయ మహదేవన్‌లకు దక్కితీరాలి!

మూగమనసులు సినిమా నిర్మాణం ఒక సాహసం. ఆరోజుల్లో సినిమా నిర్మాణం స్టూడియో కాంపౌండ్ వాల్ దాటి బయటికి వచ్చేది కాదు. కోటలూ...తోటలూ...కొలనులూ..అన్నీ ఫ్లోర్‌లోనే..ఆనాటి సినిమాల్లో మనం చూసే అందాలన్నీ కళా దర్శకుల గొప్పతనమే! అటువంటిది రాజమండ్రి, కోటిపల్లి, గోదావరి అంచుల్లో మొత్తం సినిమాషూటింగ్ జరుపుకోవడమంటే మాటలా! అందులోనూ అక్కినేని సావిత్రి జమున ముగ్గురికీ ప్రేక్షకుల్లో మంచి క్రేజుంది. ఇప్పటిలా పోలీసు బందోబస్తు అంతగా లేదు. అప్పుడప్పుడే సినిమా నటీనటుల్ని చూడ్డానికి అలవాటుపడుతున్నారు. నటీనటుల్ని చూడ్డమంటే ఆ అనుభూతే వేరు. అంతటి వ్యామోహం ప్రేక్షకుల్లో వుండేది. అక్కినేనికి అవుట్‌డోర్ రావడం ససేమిరా ఇష్టం లేదు. సావిత్రి జమున పరిస్థితీ ఇదే! అయినా ఆదుర్తి వెనక్కి తగ్గలేదు. కథాకథనాల ప్రకారం గోదావరి కాన్వాసు మీద మొత్తం షూటింగు జరిపితీరవలసిందే అని పట్టుబట్టారు. అందుకు ఆత్రేయ, ముళ్లపూడివారూ గట్టిగా సమర్థించారు. ఇద్దరూ గోదావరి ప్రియులే!

సినిమా షూటింగు మొదలయ్యింది ఎండ....గాలి.... ఉరుములూ, మెరుపులూ... ఉరకలేసి పరుగులు తీస్తున్న గోదావరీ నదిలో ...షూటింగు ప్రారంభంలో సావిత్రి పడవని ఎక్కబోయి కాలుజారిపడింది. సమయానికి అక్కినేని సాహసించి కాపాడాడు. అప్పట్నుంచి పడవ ఎక్కినప్పుడల్లా సావిత్రి భయపడుతూ ఎక్కేది. సినిమాలు మిగతా పాత్రలు ఎంజాయ్ చేస్తూ... కోనసీమ రుచుల్ని ఆస్వాదిస్తూ ఒక విహారయాత్రకెళ్ళినట్టు గడిపేశారు.

మరోపాత్ర జమున. ఈ పాత్ర 'మూగమనసులు' చిత్రానికి సూత్రధారి! రమణ గారు డెవలప్ చేశారు. అలా...అలా... చివరికి అదే గుర్తుండి పోయే పాత్రగా నిలిచిపోయింది. అల్లరి చిల్లరిగా ఆడుతూ పాడుతూ నవ్వుతూ నవ్విస్తూ కవ్విస్తూ కదిలిస్తూ సాగిపోయే పాత్ర. ఆ పాత్రకి ప్రాణంపోసింది జమున. సావిత్రి, అక్కినేనిలు పాత్రల్లో పరకాయ ప్రవేశం చేశారు. పాత్రలే కనిపిస్తాయి. ఇద్దరి మధ్య కదలాడిన అనుభవాలే.. కదలాడుతాయి... వారిద్దరూ అంతగా లీనమై నటించబట్టే సినిమా ప్రాణం పోసుకుంది. పూర్ణాయుష్షు నింపుకుంది. అక్కినేని అప్పుడప్పుడూ చెబుతుండేవారు. "దీని దుంపతెగ! నన్ను అష్టకష్టాలు పెట్టిన చిత్రం 'మూగమనసులు" అని అంటూ...సావిత్రి చాలా బాగా యాక్ట్ చేసింది అంటారు. అంతే కాదు ఈ సినిమా అంటే తనకి ఎంతో ఇష్టం. తన సంపాదనంతా ఈ సినిమా తమిళ, హిందీ రీమేక్ కోసం ధారపోసింది. అంతటి సాహసానికి పురిగొల్పింది మూగమనసులు చిత్రమే!

కొత్తగా పెళ్ళయిన జంట గోపి, రాధలు హనీమూన్ టూర్‌కి వెళతారు. గోదావరిలో బోటు షికారు కెళతారు. ఒక చోట గోపికి ఏదో గుర్తుకొచ్చి "అటువైపు వెళ్ళొద్దు... సుడిగుండాలున్నాయి అంటూ అరుస్తాడు. బోటువాడితో....ఇక్కడో మేకలు కాచుకునే అమ్మాయి వుండాలి. జమిందారు గారి మేడ, రాధ.....అంటూ గతం గుర్తు చేస్తాడు. బోటువాడు నవ్వుతూ ఓ అది నా చిన్నప్పటి విషయం బాబూ! ఆ జమిందారుగారూ లేరు. రాధమ్మా లేదు... పడవనడిపే గోపి లేడు. అదంతా ముగిసిపోయిన కథే... అదిగో ఆ రాధమ్మ, గోపిల సమాధుల వద్ద ...గౌరి తన మామ వస్తున్నాడని.. కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తోంది అని చెప్తాడు. గోపి రాకని చూసి గౌరి గుర్తుపడుతూ..వచ్చేవా మావా....బతికితే నీతోనే బతుకుతాను ఛస్తే నీ ఒళ్ళోనే ఛస్తాను! అంటూ గోపి చేతుల్లో తనువు చాలిస్తుంది. ఇదంతా అర్థం కాని తన పూర్వ వృత్తాంతం చెబుతాడు. జమిందారు– అతని కూతురు.. పడవనడిపే తను రాధని ప్రేమించి పెళ్ళాడిన పాత్ర రామరాజు. జమిందారు దగ్గర గుంటనక్కలా కూర్చున్న రాజేంద్ర.. జమిందారు భార్య సూర్యాకాంతం ఇతర పాత్రలు వీటి మధ్య అందమైన సన్నివేశాలు.. రామరాజు మోజుపడి రాధను పెళ్ళిచేసుకుంటాడు. సంవత్సరం తిరక్కుండా చనిపోతాడు. ఇది జీర్ణించుకోలేని గోపి.. గుండె మంటల్ని కడుపులోనే దాచుకొని...రాధకి రవ్వంత స్వాంతన కలిగించాలని ప్రయత్నిస్తాడు. దీన్ని ఆసరాగా తీసుకొని రాజేంద్ర నిందలు వేస్తాడు. అగ్నికి ఆజ్యం తోడయినట్లు జమున ఆ నిందల్ని పదింతలు చేస్తుంది. ఈ అవమానం భరించలేని రాధ, గోపిలు గోదారిలో పడవ నడుపుకొంటూ వెళుతుండగా వూరివారందరూ తరుముకొస్తారు. ఇదీ గతం.. తన గతాన్ని రాధతో చెబుతాడు గోపి. ఇదే కథ!

ఇది ఆదుర్తి మార్క్ చిత్రం

ఈ కథని ఆదుర్తి తప్ప మరొకరైతే హ్యాండిల్‌చేయలేరు. ఈ చిత్రం ఇంత విజయవంతమవ్వడమేంటి? అక్కడే ఆదుర్తి ప్రతిభ కనిపిస్తుంది. కొత్తదనం కోరుకున్న ప్రేక్షకులు విపరీతంగా

ఆదరించారు. సినిమాని బళ్ళు కట్టుకొని వచ్చిమరీ చుశారు. ఆ రోజుల్లో ఎనభై సంవత్సారాల వృద్ధురాలు తన జీవితంలో చూసిన మొదటి చివరి సినిమా ఇదే అంటూ ప్రచారం జరిగింది. వంద, రెండొందలు, మూడొందల రోజులాడింది. ఈ సినిమా అక్కినేని – సావిత్రి నటజీవితంలో కలికితురాయిగా నిలిచిపోతుంది. సన్నివేశాల రూపకల్పనలోనూ, వాటిని అద్భుతంగా పండించడంలోనూ నూతనంగా ఉంది.. ఇకముందు కూడా వుంటుంది.!

- ఇమంది రామారావు

9010133844

వేరు



మనపై కురిసిన ఏకాంతాలు

పెదవుల వంకీ వసారాల్లో

కలల్ని పురివేసి

బొండుమల్లెల్ని పరచాయి

అది నీ మేనిమానుకు

నేను 'వేరు' నైన కాలం

రేఖలు వృత్తాలై పరిధుల్ని పరిమితం చేశాక

అలసిన దిక్కుల రెక్కల మధ్యన ఆకాశం గాయపడింది

ఇప్పుడు 'వేరైన' ఏకాంతం దగ్ధానంతర దైన్యమయ్యింది

-కళ్యాణదుర్గం స్వర్ణలత
98486 26114

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం:. 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ. -520002.
మెయిల్ అడ్రస్
:snehaweekly.praja@gmail.com

అతడు

అతడు ప్రతిదినం
అక్షరాలను అల్పాహారంగా సేవించి
పదాలను పల్లకి ఎక్కించి
వాక్యాలని ఉద్యానవనానికి చేరుస్తాడు
ఎక్కడి నుండి వచ్చాడో
ఎంత జీవితాన్ని చూశాడో
ఎన్ని ముళ్ళపై నడిచాడో
కన్నీటి చుక్కలన్నిటినీ ఏరి
దండగా కూరుస్తాడు
కష్టాల కడలిలో మునకలేసినట్టు కనబడుతూ
జీవితపు లోతుల్లోని మేలి ముత్యాలను సేకరించి అందిస్తాడు
అమ్మ ప్రేమను కాస్త పసుపుగా చేసి
పద్యం పాదాలకు ఆప్యాయంగా పూస్తాడు
అక్కపై మమకారాన్ని మాలగా కట్టి
ఆత్మీయంగా కథా కన్యకల మెడలో వేస్తాడు

స్త్రీని తోబుట్టువులాగానో
తోటి స్నేహితురాలి లాగానో భావించే
సంస్కారపు విలువలను వలువలుగా ధరించేవాడు
చిన్నగానే కనబడే పెద్ద పుస్తకం అతడు
ఈ ప్లాస్టిక్ పూల ప్రపంచంలో పూసిన
స్వచ్ఛమైన పున్నాగ పువ్వే అతడు
మనసులేని మనుషుల మధ్యన మొలిచిన
మంచి గంధపు చెట్టు అతడు
అరుదుగా అగుపించే ముసుగు ధరించని
నేస్తపు సుమసుగంధం అతడు
మొత్తంగా ఒక ప్రత్యేకమైన అనుభూతి కవితే అతడు

-పద్మావతి రాంభక్త
9966307777



ఉల్కా లోకం

భూమ్మీద రాక్షస బల్లులు అంతరించడానికి కారణం కేవలం 15 కి.మీ.ల పొడవున్న ఆస్టరాయిడ్ వచ్చి భూమిని ఢీకొనడమేనని చాలామంది శాస్త్రవేత్తల అంచనా. అలాంటిదే మరో పెద్ద ఆస్టరాయిడ్ వచ్చి పడితే ఇప్పుడూ మహా వినాశనమే సంభవిస్తుందని అంటారు. అసలిలాంటి ఆస్టరాయిడ్‌లు ఉన్నాయనే సంగతి గీసెప్పె పియాజ్జీ ద్వారా వెలుగులోకి వచ్చింది. 1801లో 975 కిమీ పొడవున్న సెరెస్ అనే గుండ్రటి భారీ ఆస్టరాయిడ్‌ను ఆయన కనుగొన్నారు. అప్పటికి దాన్ని గ్రహంగానే పరిగణించారు. నెప్ట్యూన్, ప్లూటోలు కనిపెట్టాక దీని తీరు మీద సందేహం వచ్చింది. ఆ తర్వాత ఆస్టరాయిడ్‌గా పిలవడం మొదలైంది. 4 వెస్టా, 2 పల్లాస్ కూడా భారీవే కానీ వీటితో ప్రస్తుతానికి మనకేం ప్రమాదం లేదు. కానీ భూమికి దగ్గరగా కొన్ని ఆస్టరాయిడ్‌లు దూసుకెళ్లాయనే వార్తలు మాత్రం కంగారు పెడుతుంటాయి. ఇప్పటి వరకు అలా వెళ్లేవి 14, 464 వరకు ఉండొచ్చని గుర్తించారు. వీటిల్లో కి.మీ.కు పైగా సైజు ఉండేవి 900 పైనే. అవి ఢీకొనక్కర లేదు దగ్గరగా వెళ్లేపుడు సంభవించే ఉల్కా తాకిడి వల్ల కొన్ని గాల్లోనే దగ్ధమైతే పెద్దవాటి వల్ల భారీ క్రేటర్లు ఏర్పడతాయి.

- సూర్యకక్ష్యలో తిరిగే చిన్న రాతి కొండలే ఈ ఆస్టరాయిడ్స్.
- గ్రహశకలాల్లో విధ్వంసం చోటుచేసుకున్నపుడు ఉత్పన్నమయ్యే పదార్థాల్లో మంచు శాతం కరిగిపోయాక తయారయ్యే రాతి పదార్థాలని ఆస్టరాయిడ్స్ అంటారు.
- ఆస్టరాయిడ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించిన ఆస్ట్రొనమర్ విలియమ్ హెర్షెల్.
- సౌర కక్ష్యలో ప్రస్తుతం సంచరిస్తున్న ఉల్కల సంఖ్య ఆరు లక్షలు.

- చంద్రుడితోపాటు వివిధ గ్రహాల ఉపరితలంలో ఏర్పడే క్రేటర్లు ఉల్కల వల్లే ఏర్పడతాయి. అందుకే చంద్రుడి రూపం గుంతలుగా వుంటుంది. ఇవి చాలా పెద్దగా వుంటాయి.
- ఏడాదికోసారైనా భూమిపై పెద్ద ఉల్కల ముక్కలు పడుతుంటాయనేది ఒక నివేదిక. ఇవి దాదాపు ఒక కార్ పరిమాణంలో వుంటాయి.



- పాయింట్ 15 కిలోమీటర్ల విస్తీర్ణంలో సైబీరియాలో ఉల్కల విధ్వంసం చోటుచేసుకుంది.
- తగినంత గురుత్వాకర్షణ శక్తిని గ్రహించలేని కారణంగా ఉల్కలు ఒక కచ్చితమైన పరిమాణంలో కనిపించవు.
- అపోలో ఆబ్జెక్ట్స్ భూమి తిరిగే కక్ష్యని అధిరోహించిన గ్రహ శకలాలు.
- మార్స్, జ్యూపిటర్ కక్ష్యల మధ్య వున్న ఆస్టిరాయిడ్ బెల్ట్‌లో ఎక్కువశాతం ఉల్కలు తిరుగుతుంటాయి.

- ఆస్టరాయిడ్స్ మూడురకాలుగా వున్నాయి. మట్టి, రాళ్ళతో ఏర్పడే కాండ్రైట్(సి-టైప్).... సిలికేట్, నికెల్ ఇనుముతో ఏర్పడే స్టోని ఆస్టరాయిడ్ (ఎస్-టైప్)....ప్లాటినమ్, మెగ్నీషియం, బంగారంతో ఏర్పడిన మెటాలిక్ ఆస్టరాయిడ్ (ఎమ్- టైప్) అని పిలుస్తారు.
- సౌరకక్ష్యలో వుండే ఆస్టరాయిడ్స్ మొత్తం బరువు చంద్రగ్రహంతో సమానంగా వుంటుంది.
- భూమ్మీద రాక్షసబల్లులు అంతరించిపోవడానికి కారణమైన ఆస్టరాయిడ్ విస్ఫోటనం 66 మిలియన్ సంవత్సరాల క్రితం నాటిదనేది ఒక అంచనా.

కథ

బంధం

దాసరి శివ కుమారి
9866067664

"నమస్కారం మూర్తి బాబూ! మీరొచ్చారని తెలిసి కనపడి ఎల్దామని వచ్చాను."

"నీ కుటుంబమంతా ఎట్లా వున్నారు ఖాసిం? నాకు తెలిసిన దగ్గర్నుండీ తోటలు, కౌలుకు తీసుకుని పండ్ల వ్యాపారం చేస్తూ వుండే వాడివి. ఇప్పుడు పండ్ల తోటలనేవే లేవుగదా? మరేదైనా వ్యాపారం చూసుకొన్నావా?"

"నాకు బాగా తెలిసిన పని ఇదే బాబూ. మన భూముల్లోని నిమ్మకాయలకు మార్కెట్లో ఎంతో గిరాకీ వుంటుంది. మిగతా రకాల పండ్లు కూడా మన భూముల్లో బాగానే పండేవి. మీ అందరి తోటల్లోని పండ్ల వల్ల కదూ? నా కుటుంబమంతా వేళపట్టున తిన్నాం. పిల్లల చదువు సంధ్యలు, షాదీలు చేయగలిగాను. ఇవాల్టి రోజున చెట్టు అనేదే కనపడకుండా పోయింది. పిల్లల బాధ్యతలు అయిపోయిం తర్వాత ఇల్లొకటి వేసుకుందామన్న ఆలోచనలో వుండగానే సర్కారు భూములన్నీ తీసేసుకుంది. పంటలే లేక మాలాంటి వాళ్లకు చేతిలో పని లేకుండా పోయింది. మా ఇద్దరికీ వయస్సు పైబడింది. రోజులు ఎలా వెళతాయో సమజ్ అవటంలేదు, మూర్తి బాబూ. ఇంట్లో నుంచి ఎక్కడికీ రావాలనే అనిపించటం లేదు."

"దిగులు పడకు ఖాసిం. మగ పిల్లలు ప్రయోజకులయ్యారుగా, మీ బాధ్యత వాళ్లే చూసుకుంటారులే."

"వాళ్ల కుటుంబాల ఖర్చులు పెరిగిపొయ్యాయని అంటున్నారు. దూరదూరంగా చిన్న చిన్న నౌకరీలు చేసుకుంటున్నారు. మమ్మల్ని ఆదుకుంటారన్న నమ్మకాలు ఏమీలేవు. చిన్న ఇల్లైనా కట్టుకుని వుంటే తిన్నా, తినకపోయినా ఇద్దరం దాంట్లో పడి వుండేవాళ్లం. ఇక్కడికెవరెవరో అద్దెలకొస్తారు. ఇల్లు మరమ్మతులు చేయించి ఎక్కువ బాడుగకిస్తాం అంటున్నాడు ఇల్లుగలాయన. తమరికి మీ నిమ్మ తోటంటే ఎంత ఇజ్జత్తో, ఎంత ప్రేమ వుండేదో నాకు తెలుసు. అమ్మా, నాన్నల సమాధుల్నీ, ఆడనే కట్టించారు. తులసి చెట్లూ, ఉసిరి చెట్లూ ఎన్ని నాటించారు గోపీ బాబుతో చెప్పి. ప్రతేటా ఇక్కడి కొచ్చి పూజచేసుకుని, సమాధులకు మొక్కుకుని వెళ్తావుండే వాళ్లు. ఈనాడు అవేవీ లేకపోయె బాబూ!"

"అవును, ఖాసిం. నాకు అన్నిటికంటే అదే ఎక్కువగా బాధపెడుతున్నది. అమ్మా నాన్నల సమాధుల దగ్గర నిలబడితే మనసు ఎంతో ప్రశాంతంగా వుండేది. వాళ్లతో గడిపినట్లుగానే వుండేది. వాళ్ల ఆశీస్సులు తీసుకుని ఎంతో ఉత్సాహంగా, ధైర్యంగా తిరిగి అమెరికా వెళ్లేవాడిని. ఏడాది పొడుగునా ఆ తృప్తి వుండేది. వారిచ్చిన ధైర్యమే నన్ను నడిపిస్తూ వుండేది. ఏడాది కాగానే మరలా ఇక్కడికి కుటుంబంతో సహా వచ్చేవాడిని." అన్నాడు బాధగా మూర్తి. బాధ పడే మూర్తి వీపుపై రాయుడు అనునయంగా తట్టాడు. ఇంతలో ఇంట్లో నుంచి కాఫీలు వచ్చాయి. సుగుణే ట్రేలో కాఫీ కప్పులు పెట్టుకుని తెచ్చింది. "ఏం ఖాసిం! బీబీ ఎట్లా వుంది? బాగా దిగులుగా మాట్లాడింది. ఆ మధ్యన ఇక్కడికొచ్చినప్పుడు."

"రోజులు ఎలా గడుస్తాయని చింత పడుతూనే వుండి, బీమారవుతుంది. అమ్మా"

వీళ్లు మాటల్లో వుండగానే మిషను మీద కుట్టాల్సిన బట్టలు తెచ్చుకుని వీరాసామి తన కుట్టు మిషను వెనగ్గా వున్న గోడ అలమారాలో సర్దుకున్నాడు.

"ఊర్లో పనిపాటలు చేసుకునే వాళ్లందరూ పనులు లేక దూరదూరాలు పోతున్నారు. ఎవరి చేతిలోనూ పట్టుమని పది రూపాయలు వుండటంలేదు." అన్నాడు వీరాసామి.

మూర్తి తండ్రి సుబ్బయ్యగారు 85వ పడిలో పడ్డారు. సహస్ర చంద్ర దర్శనం చేసివున్నారు కాబట్టి తల్లిదండ్రులనిద్దరినీ కూర్చోబెట్టి ఘనంగా వేడుక జరిపింది మూర్తి కుటుంబం. ఆ సందర్భంగా దగ్గర బంధువులందరికీ కానుకలిచ్చాడు. ఆడపడుచులకు బంగారు నగలు బహుమతిగానూ ఇచ్చాడు. అక్కలిద్దరూ మూర్తి కంటే బాగా పెద్దవాళ్లు.

ooo

ఆ రోజుల్లో సుబ్బయ్య గారు పసుపు మిల్లులో గుమాస్తాగా పని చేసేవారు. తన కూతుళ్లిద్దరూ వ్యవసాయ కుటుంబాలలో ఇచ్చి పెళ్లిళ్లు చేశారు. పెద్దమ్మాయి శాంతను తమ ఊర్లోనే ఇచ్చారు. శాంతకు తమ్ముడంటే చాలా ప్రేమ. చిన్నమ్మాయి గిరిజను పక్క ఊరే ఇచ్చారు. ఆమెకు తమ్ముడిలా తన భర్త ఉద్యోగస్తుడు కాదని బాధా, అసంతృప్తీ. అప్పట్లో తమ్ముడు విజయవాడలో పీ.యూ.సీ.

చదివి పాసయ్యాడని తెలిసింది. "ఇంకేం చదివిస్తావు నాన్నా! తమ్ముణ్ణి ఏదైనా పనిలో పెట్టు" అన్నది. కాని మూర్తి మంచి మార్కులు తెచ్చుకుని ఆంధ్ర యూనివర్శిటీలో ఇంజినీరింగ్‌లో సీటు తెచ్చుకోగలిగాడు. మూర్తిని యూనివర్శిటీ ప్రొఫెసర్ గారొకరు చాలా అభిమానించేవారు. ఆ తర్వాత ఆయన అమెరికా వెళ్లి సెటిలయ్యారు. శిష్యుడి మీద వాత్సల్యంతో అతనికీ సలహాలిచ్చి చదువు అయిన తర్వాత అమెరికా రప్పించారు. మూర్తి ఆర్థిక పరిస్థితి బాగా మెరుగుపడింది. అమెరికా వెళ్లక ముందే శాంత కూతుర్ని చేసుకోమని అడిగించారు. ఇప్పుడప్పుడే పెళ్లి చేసుకోనని చెప్పి అమెరికా వచ్చేశాడు. ముందుగా తన ఊళ్లోనే నాలుగెకరాల పొలం కొని అక్కలిద్దరికీ పసుపు కుంకుమల కింద తండ్రి చేత ఇప్పించాడు. పెద్దక్క బాగా సంతోషించింది. చిన్నక్క భర్త గొణిగాడు.. పక్కూరి నుంచి వచ్చి సేద్యం చెయ్యాలా అని. ఆ రెండెకరాలకు తోడు మరికొంత కౌలుకు తీసుకుని సేద్యం చేసుకో. ఊళ్లోనే వుండి నేనూ సహాయంగా వుంటానన్నాడు సుబ్బయ్య. ఆ తర్వాత తోట పెరిగివున్న భూమి బేరానికొస్తే మూర్తి కొనుక్కుని తన కిందే వుంచుకున్నాడు. చచ్చిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కల్ని పెంచమని చెప్తూ దానిపట్ల చాలా ప్రేమను పెంచుకున్నాడు.

సుబ్బయ్య గారు బాగా వృద్ధులై పొయ్యారు. ఆయనకు స్నానం చేయించటానికీ, వాకిట్లోకీ, ఇంట్లోకీ తిప్పటానికి కూడా ఒక మనిషి అవసరమయ్యాడు. ఆ పనులకు మనిషి తోడు కావలసి వీరాసామిని ఏర్పాటు చేసుకున్నారు. పగలంతా అక్కడే మిషను కుట్టుకుంటూ వుండి కావలసిన సాయం చేస్తూ వుండేవాడు.

మూర్తి తల్లి రాజమ్మగారు తన పన్లు తాను చేసుకోగలిగే స్థితిలో వున్నారు. పెద్ద వయస్సు అయిపోయింది కాబట్టి ఆమె అక్క మనుమరాలు సుగుణనూ, ఆమె భర్తనూ తీసుకు వచ్చి ఇంట్లో పెట్టుకున్నారు. సుగుణ ఇంట్లో వంటా వార్పూ చూసుకునేది. ఆమె భర్త గోపి బయటి పనులూ, ఆస్తుల అజమాయిషీ చూస్తువుండేవాడు. మూర్తికి కూడా వీళ్లొచ్చిన తర్వాత బాగా నిశ్చింతగా వున్నది. తోట మీద వచ్చే ఫలసాయాన్నంతా అనుభవించ మన్నాడు. తల్లిదండ్రుల తదనంతరం ఇంటిని వాళ్లకే చెందేటట్లు ఏర్పాటు చేస్తానన్నాడు. ఇంకా కుటుంబ పోషణకు తను వచ్చినప్పుడల్లా డబ్బు సర్దుబాటు చేసి వెడుతూ వుండేవాడు. పాడీ, పంటలతో, ఖాసిం ఇచ్చే తోట కౌలుతో సుగుణ కుటుంబానికి బాగానే జరిగిపోతున్నది. వీరాసామి కుట్టుమిషన్ పెట్టుకున్న వరండా పెంకుటింటితో కాకుండా విడిగా వుంటుంది. మూర్తి హయాంలో కట్టించిన రెండు కొట్టు గదులూ, పెద్ద హాలు వున్న డాబా ఇల్లిది. పాత పెంకుటింటిని అంతా మరమ్మతులు చేయించి ఆధునిక సౌకర్యాలు అమర్చాడు.

సుబ్బయ్య గారినీ, ఆ తర్వాత రాజమ్మ గారినీ వెళ్ల మార్చారు సుగుణ దంపతులు. వాళ్లస్థానంలో సమాధులు మాత్రం తోటలో మిగిలాయి. మూర్తికి అదెంతో పవిత్రమైన స్థలం. పిల్లల పెళ్లిళ్లు చేసి కూతుర్నీ, అల్లుణ్ణీ, కొడుకునూ, కోడలినీ తీసుకుని తల్లిదండ్రుల సమాధుల దగ్గరకు తీసుకెళ్లి దణ్ణం పెట్టించి తీసుకొచ్చే వాళ్లు మూర్తి దంపతులు. వీరాసామి ఇప్పటికీ అదే వరండాలో మిషను కుట్టుకుంటూనే వున్నాడు.

మూర్తి వీలైనప్పుడల్లా అమెరికా నుండొచ్చి తన తోటలో బంధువులకు, మిత్రులకు ఆహ్వానం పలికి విందులు చేస్తూనే వున్నాడు. ఈనాడు తోటలూలేవు ఆకుకూరల మడులూ లేవు.



ఇన్నేళ్లుగా ఏ పని చేసినా మూర్తికి భార్య సహకారం పుష్కలంగా వుంది. ఏ శుభకార్యం చేసుకున్నా స్వదేశంలో బంధుమిత్రుల మధ్య చేసుకుంటేనే మూర్తికి తృప్తిగా అన్పిస్తుంది. ఇప్పుడు తమ ఇంట్లోకి పసిపాప వచ్చింది. ఆ పసిపాపను తీసుకొచ్చి స్వదేశపు పరిచయం కావించాలని మూర్తి దంపతుల కోర్కె. అలాగే ఆరవ నెల వచ్చింది కాబట్టి అన్నప్రాసనా తమ స్వంతూర్లో చేయాలనీ, ఎప్పట్లా తోటలో భోజనాలు పెట్టాలనీ ఆలోచించారు.

ఇప్పుడు అనుకోని విధంగా రాజధాని నిర్మాణం కోసం అందరితో పాటు తనూ తన భూమిని, భూమిలో వున్న చెట్లనూ, తన తల్లిదండ్రుల సమాధుల్నీ అన్నీ వదులుకోవాల్సి వచ్చింది. మనసంతా వెలితిగా, బెంగగా వున్నది. ఇంక ఈ ఊరితో, ఈ పరిసరాలతో తన అనుబంధం

> **"ఇప్పుడు ప్రతి ఇంట్లో ఏదో ఒక సమస్య మూర్తీ. కేవలం వ్యవసాయం మాత్రమే చేసే వాళ్లు ఎక్కువగా ఈ పరిస్థితుల్లో పక్కదోవ పడ్తున్నారు. కొంతమంది పాత ఇళ్లన్నీ పడేసి డాబా ఇళ్లు కట్టు కుంటున్నారు. ఊరి రూపురేఖలే మారిపోతున్నాయి మూర్తీ."**

తెగిపోయేటట్లుగా అన్పిస్తున్నది. ఇక నుంచీ ఎలా అని ఆలోచించసాగాడు.

ఇంతలో భోజనానికి లేవమని సుగుణ పిలిచింది. "రాయుడు మామయ్యా! మీరూ ఇక్కడే భోం చెయ్యండి మూర్తి బాబాయితో పాటు మా ఆయన ఎక్కడున్నాడో, ఎప్పుడొస్తాడో తెలియదు." అంది దిగులుగా.

"పెద్దవాళ్లిద్దరూ దాటిపోయారు. సమకూర్చుకున్న ఆస్తులన్నీ ప్రభుత్వపరం అయిపోయినయి. ప్రభుత్వమిచ్చే కొద్ది, గొప్ప ప్లాట్లు తీసుకుని ఇప్పుడప్పుడే మనమేం చెయ్యలేం. వాటిని అమ్ముకోవటానికీ ఇదంత అనువైన సమయం కాదు. మనూరు వెళ్లిపోదాం. మనం వచ్చిన పని అయిపోయింది. ప్రాప్తముంటే ఈ ప్లాట్లు మన పిల్లల కేమయినా ఉపయోగపడతాయి. ఇప్పుడిక్కడుండి మనం చేయగలిగేది ఏంలేదు అంటున్నాడు. నేనూ అదే మంచిది అనుకుంటున్నాను. ఇక్కడ ఖాళీగా వుండి పేకాటా, తాగుడు జోలికి పోతున్నాడు. పొలం పన్లేమీ లేక ఖాళీగా వుండే వాళ్లందరూ చేరి తలకొక ఆలోచన చేస్తున్నారు. గవర్నమెంట్ ఇచ్చిన కౌలు డబ్బంతా వీళ్ల సరదాలకే సరిపెట్టేస్తున్నారు." అన్నది సుగుణ దిగులుగా.

"వ్యవసాయం తప్పితే గోపీకి ఏ పనీ చేతకాదు. నేను ఏదో ఒక ఏర్పాటు చేస్తానన్నాగా. మా అవసరానికి మిమ్మల్ని తీసుకొచ్చాం. అదెలా మర్చిపోతాను నేను?" అన్నాడు మూర్తి.

"ఇప్పుడు ప్రతి ఇంట్లో ఏదో ఒక సమస్య మూర్తీ. కేవలం వ్యవసాయం మాత్రమే చేసే వాళ్లు ఎక్కువగా ఈ పరిస్థితుల్లో పక్కదోవ పడ్తున్నారు. కొంతమంది పాత ఇళ్లన్నీ పడేసి డాబా ఇళ్లు కట్టు కుంటున్నారు. ఊరి రూపురేఖలే మారిపోతున్నాయి మూర్తీ."

"రాజధాని నిర్మాణం జరిగే చోట నగరాభివృద్ధి జరిగే మాట నిజమే. పరిశ్రమలొచ్చి ఆర్థికంగా రాష్ట్రమూ బాగుపడుతుంది. కాని పంట భూములను ఖాళీ చేయించటంతోనే రైతులకు చిక్కులొస్తున్నాయి. మానసికంగా భూమితో బంధాన్ని పెనవేసుకున్న వాళ్లు విలవిలలాడుతారు రాయుడూ! ఏ పంటలు పండని బంజరు భూములైతే ఎవరికీ బాధ వుండదు" భోజనాల మధ్యలోనే శాంతక్క లోపలికొచ్చింది. "పొద్దున్నే ఊర్లోకి వచ్చినవాడివి ఇంతవరకూ ఇంటి వైపుకైనా రాకపోతివి. మరదల్నీ, పిల్లల్నీ ఎవర్నీ తీసుకు రాకపోతివి, ఏంటయ్యా ఇది" అన్నది బాధగా.

"స్కూల్లో ప్రోగ్రామేగా? ఎవరూ రామన్నారు. నీ వొంట్లో ఎలా వున్నది? బావేమంటున్నాడు?"

"ఏదో బాగానే వున్నాం. మీ బావకు భూమి పోయిన దిగులు బాగా పట్టుకున్నది. మగపిల్లలిద్దరికీ పొలం పంచి ఇవ్వాలని ఆడపిల్లకేం భూమి ఇవ్వకుండా వుంచాడు. ఆడ పిల్లకు కేవలం డబ్బుతో, బంగారంతో సరిపెట్టాడు. నా పసుపుకుంకానికి మీరిచ్చిన భూమీ, తాను కొన్నదీ మొత్తం గవర్నమెంటుకు ఇవ్వాల్సివచ్చింది. గవర్నమెంటు తీసుకున్న భూమికి కౌలు ఇస్తుంది. కొన్ని వందల గజాల ప్లాట్లు ఇస్తారు. ఆ ప్లాట్లు బాగా రేటు పలుకుతాయి. మనకు ఇబ్బందేం వుండదు అంటారు మగపిల్లలు. ఇంక నేను చేసే పనేముంటుంది? నేనేం కావాలి? అని మీ బావ దిగులేసుకున్నాడు. మొన్న ప్లాట్ల పంపకమప్పుడు మంచి ఏరియాలో తనకు ప్లాట్లు రాలేదని చిన్న బావ ఒకటే సణుక్కుని వెళ్లాడు. మాలాంటి సన్నకారు రైతు కుటుంబాలన్నింటికీ గుండె కోతగానే వున్నది. చేసేదానికి చేతిలో పనేమీలేక, గోళ్లు గిల్లుకుంటూ కూర్చోలేక అల్లాడిపోతున్నారు." అంది శాంతక్క ఏకబిగిన.

"చిన్నక్కయ్య ఇంటికి సాయంత్రం మనమే వెళ్దాంలే" అన్నాడు మూర్తి. వీళ్లందరి మాటలతో మూర్తి మనస్సు మరింత బరువయ్యింది. ముందు నన్ను నేను సముదాయించుకోవాలి. ఆ తర్వాత తను మరలా అమెరికా వెళ్లేలోగా వీళ్లందరి బాధ తగ్గేటట్లు ఏదైనా లేపనం రాయాలి అని ఆలోచించాడు.

సోలార్ శక్తిని వినియోగంలోకి తెచ్చే ప్లాంట్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే తన ఊరిలోని కొందరికి పని దొరుకుతుంది. కొందరికైనా శిక్షణ ఇచ్చి పని కల్పిస్తే మరెందరికో మనస్తాపం తీర్చినవాడినవుతాను అని ఆలోచించాడు మనసున్న మూర్తి. లేదా మరింకేదైనా పని కల్పించే ఏర్పాటు ప్రభుత్వం చేసేట్టుగా ప్రయత్నించాలి. ఇదంతా తర్వాత ఓ ఊరితో ఇంత బంధం ఉంటే ఊళ్లకు ఊళ్లు ఖాళీ అయిపోవడం ఎంత తీవ్రమైన విషయం. సొంతూరి బంధమంటే ఇదేనేమో..! అని తను చిన్నప్పుడు ఆడుకున్న వీధి మధ్య చెట్టు వైపు చూశాడు. అంతా ఊహించనంతగా మారుతుంటే అదొక్కటే నిలబడగలిగింది. ఊరు విశాలమవు తుంటే మనసులు ఇరుకైపోతుంటే ఏదో రోజు అడ్డొస్తుందని ఈ బంధాన్ని అడ్డంగా కొట్టేస్తారేమో అనే దిగులుతో కంట తడి పెట్టుకున్నాడు. ఆ బంధం మరింత బరువుగా ఊగిసలాడింది.

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

ఒకప్పుడు ప్రతి ఇంట్లో చందమామ, పంచతంత్ర, బాలమిత్ర, కాశీమజిలీ కథలు ఇలా ఎన్నో కథల పుస్తకాలు కొలువు తీరుండేవి. చిన్నపిల్లలే కాదు పెద్దవాళ్లు కూడా ఈ కథల పుస్తకాలని చదివేస్తుండే వాళ్ళు. ఇప్పటి పిల్లలకి బుక్ రీడింగ్‌కి బదులు, ఫేస్ బుక్, స్మార్ట్‌ఫోన్లతోటే కాలక్షేపం అయిపోతోంది. పిల్లల చేతుల్లో పుస్తకాల కంటే ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. పుస్తకాలు చదివే అలవాటు దాదాపు అటకెక్కేసింది. పుస్తకం తన ఉనికిని పూర్తిగా కోల్పోకుండా వుండేందుకు స్వస్తికా గురుంగ్, సంజుక్త్ సహా 'వాల్ ఒ బుక్స్' అనే కొత్త ఆలోచనతో గ్రామీణ ప్రాంతాల్లో లైబ్రరీలని ఏర్పాటు చేస్తున్నారు. పూర్తిగా పిల్లలు నిర్వహించే ఈ లైబ్రరీ గురించి మీరూ తెలుసుకోండి.

గోడ లైబ్రరీలు

కాలంతో పాటు సమాజంలోనూ మార్పులు చోటుచేసుకుంటాయి. మారుతున్న సమాజంలో పిల్లల అలవాట్లలోనూ మార్పులొచ్చాయి. ఆ ప్రభావం పుస్తక పఠనంపైనా పడింది. గ్యాడ్జెట్స్ హవాలో నేటి తరం చిన్నారులు పూర్తిగా పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు కృషిచేస్తున్నారు స్వస్తిక్, సంజుక్త్. ఓ సారి కలకత్తాలోని కొన్ని గ్రామాల్లో పర్యటిస్తున్న స్వస్తిక్‌కి దగ్గర్లో ఒక్క లైబ్రరీ కూడా కనిపించకపోవడం ఆశ్చర్యపరిచింది. పెద్ద పట్టణాల్లో కొన్ని లైబ్రరీలు వున్నా వాటిని నిరుపేదలు ఉపయోగించుకోలేక పోతున్నారు. గ్రామాల్లో వున్న ఒకటి రెండు లైబ్రరీల్లో అరకొర వసతులు, అనారోగ్యకరమైన పరిసరాలే కనిపించాయి. అప్పుడే గ్రామాల్లో పిల్లలెవరూ లైబ్రరీలని వినియోగించుకోలేకపోతున్నారనే సంగతి తెలిసింది. ఇదంతా గ్రామాల్లో కనిపించే పరిస్థితులైతే పట్టణాల్లో దీనికి పూర్తి భిన్నంగా వుంటుంది. చిన్న వయసులోనే పిల్లలందరూ స్మార్ట్ ఫోన్లు ట్యాబ్‌లలో మునిగితేలుతున్నారు. పుస్తక పఠనానికి పూర్తిగా దూరమవుతున్నారు. ఈ ధోరణుల్లో మార్పు తెచ్చేందుకు తక్కువ ఖర్చుతో లైబ్రరీలని ఏర్పాటు చేసే ఆలోచన చేశాడు. సంజుక్త్‌తో కలిసి కొన్ని స్వచ్ఛంద సంస్థలు, స్థానిక పాఠశాలలని సందర్శించారు. లైబ్రరీలకి చోటైతే దొరికింది. ఇక మిగిలింది పిల్లలని ఈ లైబ్రరీల వైపు నడిపించడమే...అదే వాళ్ళకి పెద్ద సమస్యగా మారింది. అందు కోసం కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. అప్పుడే 'వాల్ ఒ బుక్స్' ఆలోచనకి బీజం పడింది. నిజానికి సంజుక్త్ ఆలోచనే ఈ 'వాల్ ఒ బుక్స్'. లైబ్రరీ కోసం కొందరు వాలెంటీర్స్, టీచర్లని ఎంపిక చేసుకున్నారు. టీచర్లంతా...ఆరు నుండి పదహారేళ్ళలోపు చిన్నారులే. వివిధ అంశాల్లో వీరిచ్చే ప్రసంగాల ద్వారా వీళ్ళని ఎంపిక చేస్తారు. వారికి లైబ్రరీ నిర్వహణలో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఒక్కో టీచర్‌కి 35 కిలోల ఒక కిట్‌తోపాటు ఒక వలంటీర్‌ని కేటాయిస్తారు. ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ భాషల్లో పేరొందిన వంద కథల పుస్తకాలు, బుక్ హ్యాంగర్స్, నోటీస్ బోర్డ్‌లని కలిగుంటాయి మన బుల్లి టీచర్లు అందుకునే కిట్స్. బుక్ హ్యాంగర్స్, నోటీస్ బోర్డులు లాంటి వన్నీ జనపనారతో తయారుచేసినవే... ఒక్కో లైబ్రరీ ఏర్పాటుకు పట్టే సమయం పద్నాలుగు రోజులు. లైబ్రరీ ఏర్పాటు పనుల్లో స్థానిక చిన్నారులని భాగస్వాములని చేస్తారు. తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీల్లో అత్యంత ప్రత్యేకతని సంతరించుకుంది 'చదువుల చెట్టు'. సాధారణ లైబ్రరీలన్నిటి కంటే 'వాల్ ఒ బుక్' భిన్నంగా వుంటుందనే విషయం ఇప్పటికే అర్థమయ్యింటుంది. ఇంతకీ ఈ చదువుల చెట్టు ఏంటనేగా మీ సందేహం.... లైబ్రరీ ఏర్పాటుకు ఎంచుకున్న భవనాల గోడలపై ముందుగా పెద్ద చెట్టు ఆకారాన్ని గీసి అందంగా రంగులు అద్దుతారు. ఆ చెట్టుకి బుక్ హ్యాంగర్స్‌ని అమరుస్తారు. జనపనారతో అలంకరించిన చిన్న సంచుల్లో కథల పుస్తకాలని వుంచి వాటిని హ్యాంగర్స్‌కి తగిలిస్తారు. ఈ వినూత్న ఆలోచనే చిన్నారులని కథల పుస్తకాలు చదివేందుకు 'వాల్ ఒ బుక్స్' లైబ్రరీ వైపు నడిపిస్తోంది. కథల పుస్తకాలతోపాటు, సాహిత్యం, ఎన్‌సైక్లోపీడియా పుస్తకాలనీ పిల్లలు చదివేందుకు ఇష్టపడుతున్నారు. ఫీడ్ బ్యాక్ బాక్సుల్లో చిన్నారులు వుంచే ఉత్తరాల ద్వారా వారికి ఆసక్తిని కలిగించే విషయాలని ఇక్కడ బోధిస్తుంటారు. ఇలా ఒక్క కలకత్తాలోనే వందకుపై 'వాల్ ఒ బుక్స్' లైబ్రరీలని ఏర్పాటు చేశారు. అవన్నీ మంచి ఫలితాన్ని ఇచ్చాయి. ప్రస్తుతం ఢిల్లీ, అరుణాచల్ ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీలు పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుతున్నాయి. 'వాల్ ఒ బుక్స్' ఇప్పటికే 45వేల మంది చిన్నారుల్లో పుస్తకాలని చదివే ఆసక్తిని పెంచింది. రెండేళ్ళలో పది కోట్ల మంది చిన్నారులకి పుస్తకాలని చేరువచేసే సంకల్పంతో పనిచేస్తున్న వాల్ ఒ బుక్స్ బృందం మర్ని ప్రాంతాల్లో వలంటీర్లకి శిక్షణ ఇస్తోంది. చిన్నారుల్లో పుస్తక పఠన ఆసక్తితోపాటు విజ్ఞానాన్ని పెంచుతున్న ఈ తరహా లైబ్రరీలు ప్రతి రాష్ట్రంలోనూ 100 లైబ్రరీలని ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు.





ఆలోచించాల్సిన సమయం ఇదే

"కష్టజీవికి ఇరువైపులా నిలిచినవాడే కవి" అని నిర్వచించారు మహాకవి శ్రీశ్రీ. సరిగ్గా అలాంటి ఆదర్శాన్ని వంటబట్టించుకుని కవిగా ఎందరికో సుపరిచితుడైన అనంతోజు మోహన్‌కృష్ణ రాసిన కవితలు తాజాగా 'ఆలోచన చేద్దామా...!' అనే సంపుటిగా మన ముందుకు వచ్చాయి. మెదడు లేని వారి సంగతేమో గానీ మెదడున్న ప్రతీ ఒక్కరూ ఆలోచిస్తూనే ఉంటారు. అయితే ఆ ఆలోచన అనేది చుట్టూ ఉన్న సమాజం గురించి, సమాజంలో ఉన్న అసమానతలను ప్రక్షాళన చేయడం గురించి, మానవీయత గురించి, ప్రజా పోరాటాల గురించీ అయితే అది సవ్యమైనదే. ఈ కవితల సంపుటి నిండా ఇలాంటి వాటి గురించిన ఆలోచనలే అక్షరాలై అడుగడుగునా పాఠకుల్ని నిలువరిస్తాయి. సమకాలీన జీవితం గురించి స్పందించమంటాయి. నిర్జీవ పదార్థంలా జడత్వంలో ముడుచుకుపోవద్దని కర్తవ్యాన్ని నిర్దేశిస్తాయి. ఈ కవితల పుస్తకంలో అభినందనలు, కృతజ్ఞతల పేజీలను దాటి ముందుకు వెళ్తే మొత్తం 36 కవితలున్నాయి. ఇవన్నీ ఇటీవలి కాలంలో రాసినవే. ఇందులోని తొలికవితను "ప్రగతికి, సంస్కృతికి... మూలమై నిలిచి...మస్తకాలు మరమ్మతులు చేసే...పుస్తకాలే నా నేస్తాలు" అని ముగిస్తూ తనకు 'పదబంధాలతో అనుబంధాలు' ఎలాంటివో వివరించడం ఆకట్టుకుంటుంది. ఇలా కవితల వరుసలో 'ఏం మరచి పలకాలి స్వాగతం, వేకువ పూలై వికసిద్దాం, సుందరయ్య గారికోసం 'వేగుచుక్క నీవయ్యా!', 'ఇంక్విలాబ్, నా కవిత, నిరుద్యోగి ఎదురుచూపు, అగాధం, వీడ్కోలు, సునామీ, ఆలోచించు...నేస్తమా, నేటి సమాజంలో', జ్యోతిబసు గురించి 'వెలుగుల జ్యోతి' , 'వెళ్లొస్తానంటాం...గానీ, ఊబి, పద్మవ్యూహం' కవితలు, మహాకవి గురజాడ గురించి 'యుగకర్త', బోడేపూడి గురించి 'బోడేపూడికి జోహార్లు', జాషువా గురించి 'విశ్వనరుడు' తదితర కవితలు అర్థవంతంగా చదివిస్తాయి. వారి ఔన్నత్యాన్ని మళ్లీ కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి. ఈ సంపుటిలో ఉన్న "పేపర్ బాయ్" కవిత చాలా బాగున్న కవితల్లో మొదటి కవితగా చెప్పొచ్చు. మోహన్‌కృష్ణ కవిత్వం నిండా ఉన్న ఆర్ద్రత పాఠకుల హృదయాలకు వేగంగా అందుతుంది. నిర్భయ గురించి, రోహిత్ గురించి కవి ఆవేదనా స్వరం కొన్ని కవితల్లో బలంగా తాకుతుంది. ఈ సంపుటిలో ఉన్న అన్ని కవితలూ కవికి సమాజం పట్ల ఉన్న నిబద్ధతకూ, నిజాయితీకి దర్పణంగా నిలుస్తాయి. ప్రగతిశీల దృక్పథంతో ప్రతి కవితావాక్యం ఆలోచనల్ని రగిలిస్తుంది. ప్రపంచీకరణ వల్ల వచ్చిన ప్రమాదానికీ, సామ్రాజ్యవాద సంస్కృతికీ నిరసనగా కవితల్లో అక్షరాలను అస్త్రాలుగా సంధించడాన్ని చూడొచ్చు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 'వేకువ పూలై వికసిద్దాం' అనే చైతన్య నినాదంతో సామాజిక చైతన్యమే ఊపిరిగా ముందుకు సాగుతున్న అనంతోజు మోహన్‌కృష్ణ నుంచి మరింత చిక్కనైన కవిత్వం రావాలని ఆభిలాషిద్దాం. ఆకాంక్షిద్దాం.

పుస్తకం పేరు : ఆలోచన చేద్దామా..! (కవిత్వం)
రచన : అనంతోజు మోహన్‌కృష్ణ
పేజీలు : 80,
ధర : రూ60/-
ప్రతులకు : అన్ని ప్రజాశక్తి, నవతెలంగాణ బుక్‌హౌస్‌లలో

- బెండాళం క్రిష్ణారావు

నిజ నేస్తాలేనా...



ఈ రోజుల్లో ఫేస్‌బుక్ ఎకౌంట్ లేనోళ్ళు లేరనే చెప్పాలి. ఎకౌంట్ సంగతి సరే మరి ఫ్రెండ్స్‌లిస్ట్ మాటేంటి..... ఒక్కొక్కరి ప్రొఫైల్‌లో ఈ లిస్ట్ వందల్లో వుంటుంది. మరి ఈ ఫేస్ బుక్ ఫ్రెండ్స్‌లో అసలైన ఫ్రెండ్స్ ఎంతమంది?? నిజంగా మనతో టచ్‌లో వుండేది ఎంతమంది?? అమెరికాకు చెందిన టాంజ హోలాన్డర్‌కి ఓసారి ఇదే సందేహం వచ్చింది. అయితే తను ఈ విషయాన్ని అందరిలా లైట్ తీసుకోలేదు. రియల్ ఫ్రెండ్స్‌తో పాటు ఎప్పుడూ మనతోపాటు వుండే నేస్తాలకీ సోషల్ మీడియా సావాసాలకీ మధ్య వ్యత్యాసాన్ని కనిపెట్టాలనుకుంది. ఇది 2010లో తను తీసుకున్న న్యూ ఇయర్ రిజల్యూషన్. ఇక 'ఆర్ యు రియల్లీ మై ఫ్రెండ్' పేరుతో ఒక ప్రపంచ యాత్ర మొదలుపెట్టింది టాంజ. అప్పటికి తన ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ లిస్ట్ 626. ఒక్కో ఫ్రెండ్‌ని కలిసి వాళ్ళ ఇంటి పరిసరాలని అందమైన తన పోట్రెయిట్‌లలో బంధించేది. వినూత్నరీతిలో తనుచేపట్టిన ఈ యాత్ర అందరినీ ఆశ్చర్యపరిచింది. నెలకి రెండు వారాల ప్రయాణంతో మొత్తం 400 మందిని కలిసింది. అమెరికాలోని నలభై మూడు ప్రాంతాలతోపాటు పన్నెండు దేశాల్లో కొనసాగిన తన యాత్ర 2016లో పూర్తయ్యింది. ఆన్‌లైన్ స్నేహాల్లో రియాలిటీ మాట పక్కన పెడితే ఐదేళ్ళ తన యాత్రలో కొందరు తనపై చూపిన అభిమానం, వారిని పోట్రెయిట్‌లో బంధించిన క్షణాలు తనకి మంచి అనుభూతులని మిగిల్చాయంటారు టాంజ. అంతే కాదు ఈ చిత్రాలన్నీ తన కొత్త ఆర్ట్ ప్రాజెక్ట్‌లో భాగమయ్యాయి. దీంతోపాటు తను చేసిన యాత్ర మొత్తాన్నీ ఒక డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ యు మై రియల్ ఫ్రెండ్' పేరుతో మార్చ్ పద్దెనిమిదిన విడుదల చేసింది.

షీర్ కుర్మా

కావాల్సిన పదార్థాలు

సన్నని సేమియా ప్యాకెట్- 1(చిన్నది)

వెన్నతీయని పాలు-1 లీ

పంచదార-1 కప్పు

యాలకులు-20

బాదం, జీడిపప్పు, పిస్తా, మిల్క్ మెయిడ్-1 కప్పు

కుంకుమ పువ్వు- 1/2 టేబుల్ స్పూన్

చిరౌంజీ పలుకులు-3 టేబుల్ స్పూన్లు

ఎండుద్రాక్ష-1/2 కప్పు

ఖర్జూరం పలుకులు-10

నెయ్యి -1 టేబుల్ స్పూన్

వెన్న -కొద్దిగా

తయారుచేసే విధానం

బాణలిలో వెన్న వేసి అందులో సేమియాను వేయించాలి. మంట తగ్గించి రెండు మూడు నిమిషాలు వేయించాలి. అందులో పంచదారను చేర్చి మరో రెండు నిమిషాలు వేయించుకోవాలి. అందులో ఒక్కో కప్పు చొప్పున పాలని చేర్చాలి. ఒక పొంగు వచ్చాక ఎండుద్రాక్ష, యాలకులు, బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులని సగం వేయాలి. తర్వాత మిగిలిన పంచదార, సేమియా కూడా వేయాలి. ఈ మిశ్రమం సగం అయ్యేవరకు జాగ్రత్తగా కలుపుతూ ఉడికించుకోవాలి. సేమియా మెత్తగా అయ్యాక చిరౌంజీ, మిల్క్ మెయిడ్‌ని చేర్చి ఉడికించాలి. పదినిమిషాల తర్వాత కుంకుమ పువ్వు రేకలు, ఖర్జూరాలు మిగిలిన యాలకుల పొడి, డ్రైఫ్రూట్స్ వేసి దింపేయాలి. సర్వింగ్ గ్లాసుల్లో వేడి వేడి షీర్ కుర్మాని పోసి అతిథులకందించండి.

ఫిష్ బిర్యానీ

కావాల్సిన పదార్థాలు

చేపలు-500 గ్రాములు, బాస్మతి బియ్యం-1-1/2 కప్పు, అల్లం పేస్ట్-1 టేబుల్ స్పూన్, టమాటా తరుగు- 4 టేబుల్ స్పూన్లు, కారం-1 టేబుల్ స్పూన్, గరమ్ మసాలా-1 టేబుల్ స్పూన్, నిమ్మరసం-1-1/2 టేబుల్ స్పూన్, పసుపు-1/8 టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి సరిపడా, గ్రేవీ కోసం, నూనె-3 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయల తరుగు-3/4 కప్పు(చక్రాల్లా తరగాలి), బిర్యానీ ఆకు-1, బిర్యానీ పువ్వు-1, యాలకులు-3 దాల్చిన చెక్క-1, వెల్లుల్లి రెబ్బలు-4, జీరా-1/2 టేబుల్ స్పూన్, జాపత్రి-1 (చిన్నది), అల్లం వెల్లుల్లి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు, బిర్యానీ మసాలా పొడి-1 టేబుల్ స్పూన్, కొత్తిమీర పొడి-1/2 టేబుల్ స్పూన్

కారం-1/2 టేబుల్ స్పూన్, పెరుగు/కొబ్బరి పాలు-3/4 కప్పు, పుదీనా తరుగు-1/2 కప్పు కొత్తి మీర తరుగు-1/2 కప్పు,కుంకుమ పువ్వు-చిటికెడు,పాలు-2 టేబుల్ స్పూన్లు ఉప్పు-రుచికి తగినంత



తయారుచేసే విధానం

ముందుగా కొద్దిగా గోరువెచ్చని పాలలో కుంకుమ పువ్వుని వేసి పక్కనపెట్టుకోవాలి. బియ్యాన్ని శుభ్రంగా కడిగి 20 నిమిషాల పాటు నానబెట్టాలి. తర్వాత కాస్త పలుకుగా ఉండేలా వండి పక్కన పెట్టాలి. ఒక వెడల్పాటి పాత్రలో అల్లం పేస్ట్, టమాటాతరుగు, కారం, గరమ్ మసాలా, నిమ్మరసం, పసుపు, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో చేపలని కూడా వేసి కొద్ది సేపు నాననివ్వాలి. ఇప్పుడు స్టౌపై ప్యాన్ పెట్టి నూనె వేసి చేపముక్కల్ని రెండువైపులా గోధుమరంగు వచ్చేలా వేయించాలి. మసాలా కూడా బంగారు రంగువచ్చే వరకు వేయించి వీటిని ఒక ప్లేట్‌లో వుంచి పక్కనపెట్టుకోవాలి. ప్యాన్‌పై కొద్దిగా నూనె వేసి ఉల్లిపాయ ముక్కల్ని వేయించాలి. గార్నిష్ కోసం కొన్ని పక్కన ఉంచుకొని మిగిల వాటిలో బిర్యానీ ఆకు, బిర్యానీ పువ్వు, యాలకులు, దాల్చిన చెక్క, వెల్లుల్లి రెబ్బలు, జీరా,జాపత్రి వేసి వేయించుకోవాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, టమాటా తరుగు కూడా వేసి పదార్థాలన్నీ పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు గరంమసాలా పొడి, కొత్తిమీర పొడి, కారం వేసి రెండు నిమిషాలు వేయించుకోవాలి. అందులో కొబ్బరి పాలు పోసి ఈ మిశ్రమం చిక్కబడే వరకూ ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక మందపాటి పాత్రలో కొద్దిగా ఉడికించిన బియ్యాన్ని వుంచి దానిపై కొబ్బరి పాలతో ఉడికించి పెట్టుకున్న మిశ్రమాన్ని పరిచినట్టు వుంచాలి. కొద్దిగా పుదీనా, కొత్తిమీర తరుగు, వేయించి పెట్టుకున్న చేపముక్కలని కూడా వుంచి దానిపై మిగల అన్నాన్ని వుంచాలి. దానిపై వేయించిన ఉల్లిపాయ ముక్కలు, పాలలో నానబెట్టిన కుంకుమ పువ్వుని కూడా చేర్చి మూత పెట్టి కుక్కర్‌లో వుంచాలి. ఈ కుక్కర్‌ని మందపాటి పెనంపై వుంచి చిన్న మంటపై పది నిమిషాల పాటు ఉడకనివ్వాలి. పదిహేను నిమిషాల తర్వాత బిర్యానీని సర్వింగ్ ప్లేట్స్‌లో వుంచి వేడి వేడిగా సర్వ్ చేయండి.



లెక్కించండి

ఇక్కడున్న వృత్తాల్లో ఒక వరుసని అనుసరించి కొన్ని అంకెల్ని వుంచాం. అయితే కింది వరుసలో వున్న వృత్తాల్లో ఒక్క అంకె మిస్సయింది. అది ఎంతై వుంటుందో కనిపెట్టి అక్కడ రాసేయండి.

చుక్కలు కలిపేద్దాం

పదాలు పూరించండి

ఇక్కడ మొత్తం తొమ్మిది బొమ్మలు వాటి పేర్లున్నాయి. అయితే వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయింది. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి అక్కడ రాసేయండే!



జ : c, b, k, m, s, t, u, c, r

దారి కనిపెడదాం

గుర్రం పై వున్న ఈ వ్యక్తి అవతలి పక్కన వున్న కోటని చేరే దారిని కనిపెట్టండి.



నీడతో బొమ్మ

పిల్లలూ మీకు బొమ్మలు చేయడమంటే భలే ఇష్టం కదా! చేతి వేళ్ళతో బాతు బొమ్మని ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం.. చీకటి గదిలో చిన్న వెలుగులో మీరూ ప్రయత్నించండి.

ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని కాయగూరలు వాటి చుట్టూ కొన్ని నీడలు ఉన్నాయి. ఏ కాయగూర నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో వున్న తేడాలని గుర్తించి పెన్‌తో సున్నాచుట్టేయండి.



అతి చిన్న సొరచేప



పిల్లలూ మీరు రకరకాల సముద్ర జీవాల గురించి తెలుసుకుంటుంటారు. మరి మీకు వాక్విటా పార్పాయిస్ అనే సముద్ర చేప గురించి తెలుసా!

◆ వాక్విటా సముద్ర క్షీరదాల్లో అతి చిన్న జంతువు.

◆ వీటినే గల్ఫ్ ఆఫ్ క్యాలిఫోర్నియా హార్బర పార్‌పాయిస్, చొఛిటొ, డెసర్ట్ పార్పాయిస్ అని కూడా పిలుస్తారు.

◆ ఇవి మెక్సికోలోని గల్ఫ్ ఆఫ్ క్యాలిఫోర్నియాలో ఎక్కువగా టకనిపిస్తాయి.

◆ 20వ శతాబ్దం వరకు వీటి మనుగడ గురించి చాలామందికి తెలీదు.

◆ వీటి శరీర పైభాగం ఎక్కువగా బూడిద రంగులోనూ, ఉదర బాగం లేత బూడిద, తెలుపుకలగలుపు రంగుల్లో వుంటుంది. కంటి చుట్టూ ఉండే నల్లని వలయాకారం వీటికి ప్రత్యేక ఆకర్షణ.

◆ పార్పాయిస్ జాతికి చెందిన ఈ సముద్ర చేపలు నాలుగున్నర అడుగుల ఎత్తు, 43-49 కేజీల బరువుని కలిగుంటాయి.

◆ మగవాటి కంటే ఆడవి కాస్త ఎక్కువ శరీర పరిమాణాన్ని కలిగుంటాయి.

◆ వీటికి వినికిడి శక్తి బాగా ఎక్కువ.

◆ సముద్రాల్లో వుండే చేపలు, పీతలు, ఆక్టోపస్, స్క్విడ్‌లని ఇష్టంగా తినేస్తాయి.

◆ ఇవి ఎక్కువగా ఒంటరిగా వుండేందుకు ఇష్టపడుతుంటాయి. అయితే ఆహారం, ఈత కోసం మాత్రం మూడు, నాలుగు గుంపుగా వెళతాయి.



◆ అనుకూల వాతావరణ పరిస్థితుల్లో వీటి జీవిత కాలం 20 సంవత్సరాలు.

◆ ఇవి 10-11నెలల మధ్య కొత్త వాటికి జన్మనిస్తాయి.

◆ టొటొబా చేపల కోసం వేటగాళ్ళు పన్నే వలల్లో చిక్కుకోవడం తోపాటు చైనా, యూరప్ దేశాలకి వీటి మాంసాన్ని ఎగుమతి చేయడం ద్వారా 1996 నాటికి వీటి సంఖ్య గణణీయంగా తగ్గిపోయింది.

◆ అత్యంత ప్రమాదకర స్థితిలో వున్న వీటిని ఐయుసిఎన్ 1996లో రెడ్‌లిస్ట్‌లో చేర్చింది.

◆ 2014-16 నాటికి వీటి సంఖ్య ఎంతో తెలుసా...కేవలం 60 మాత్రమే.

◆ ప్రస్తుతం వీటి సంఖ్య ముప్ఫైకి చేరుకోవడంతో మెక్సికన్ ప్రభుత్వం సముద్రాల్లో చేపల వేటని పూర్తిగా నిషేధించింది.

పదవికాసం - 66

కూర్పు: రావెళ్ళ

ఆధారాలు

అడ్డం

1. మార్పు చేర్పులు చేయు (4)
3. మారాకు వేయు (4)
7. సంతోషం (2)
8. అవకాశం, వీలు (3)
9. బియ్యం ముక్కలు (2)
12. తరువాత (3)
13. గద్ద కన్నా పెద్దది. జటాయువు జాతి పక్షి (3)
17. యాచన (2)
18. మరణం లేనిది (3)
19. అటు నుండి దృష్టి (2)
22. గాఢ నిద్ర (4)
23. మైమరపు (4)

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

నిలువు

1. సవర భాష మాట్లాడే ప్రజలు (4)
2. మారుమ్రోగులో సగం (2)
4. పిడికిలి బిగించి కొట్టు (2)
5. తేలిక (4)
6. నాగరికత (3)
10. అడవులు (3)
11. గజిబిజిగా మచిలీపట్నం (3)
14. అహంకారం (4)
15. యుద్ధం (3)
16. శంఖువు యొక్క పొడి కింది నుండి (4)
20. తోక తెగిన మన్మధుడు (2)
21. వ్యత్యాసం (2)

సుడోకు

9					5			6
		4						
	7		8	1	4	5	9	
						8		7
		2		5		6		
3	1	5						
	6		2			4		
		7		6		3		
			7					5

గతవారం జవాబులు

4	5	2	3	8	7	9	6	1
3	8	6	9	1	4	7	2	5
7	9	1	2	6	5	8	4	3
5	1	7	4	9	8	6	3	2
8	3	9	1	2	6	4	5	7
2	6	4	5	7	3	1	8	9
1	4	5	6	3	9	2	7	8
6	2	8	7	5	1	3	9	4
9	7	3	8	4	2	5	1	6

1 ఆ	✿	2 వా	3 న	✿	4 బా	వి	✿	5 క
6 ట	7 క్కు	✿	య	✿	కు	✿	8 స	రి
✿	9 వా	10 మ	న	✿	11 లు	12 ల	క	✿
13 గు	✿	న్ను	✿	14 ప్రా	✿	త	✿	15 న
16 ట	పా	✿	17 సు	కృ	తి	✿	18 చే	వ
క	✿	19 నా	✿	తం	✿	20 తీ	✿	ల
✿	21 రూ	ప	22 కం	✿	23 బీ	రు	24 వా	✿
25 ఏ	పు	✿	దు	✿	ట	✿	26 సు	27 మ
డు	✿	28 పా	లు	✿	29 లు	తో	✿	ర్మం

గొడుగు వీధుల్లో



వీధిలోకెళ్లే ముందు గొడుగు విప్పడం ఈ కాలంలో కామనే. కానీ కొన్ని వీధులే మీకు గొడుగు పడితే. అవునండి.. గాల్లో వేలాడుతున్న వందలాది రంగుల గొడుగుల్ని ఈ వీధుల్లో చూడొచ్చు. వీటి కిందుగా వెళుతుంటే వానవిల్లు నీడన నడుస్తున్న అనుభూతి కలుగుతుంది. ఇవన్నీ పర్యాటకాన్ని అభివృద్ధి చేసుకోడానికో, ఓ ప్రత్యేక ఉత్సవాల సందర్భంగానో ఏర్పాటు చేయడం పెరిగిపోతోంది. బెల్‌గ్రేడ్‌లో మొదలైన ఛత్ర వీధులు మాడ్రిడ్, ఫెతియా, ఇస్తాంబుల్, లండన్, డబ్లిన్, బాత్ నగరాల్లో రంగుల నీడనిస్తున్నాయి. కొన్ని శాశ్వతంగా ఉంటే కొన్నింటిని కొన్ని రోజుల పాటు ముస్తాబు చేస్తారు. ఎలాగు గొడుగుల సీజనే కదా మన నగర వీధులకు ఛత్రం పడితే బాగుండనిపిస్తోంది కదూ. గొడుగు గొడుగుకి మధ్య వాన ధారను దాటుతూ వెళ్లడం భలే గమ్మత్తుగా ఉంటుంది కదూ.



వాన జల్లుల్లో..!





వానొచ్చెనంటే మనం
ఇళ్లలోకి పరుగెడతాం. లేదా ఎక్కడోచోట తల తడవకుండా
దాచుకుంటాం. మరి జంతువులైతే..! అవి గొడుగులు
విప్పలేవుగా అనుకోకండి ఆకులు, పూలు,
పుట్టగొడుగులు ఇలా ప్రకృతిలోని కొమ్మారెమ్మా
వాటిని కాచుకుంటాయి. ఇలాంటి విషయాల్లో
కప్పలే మరీ తెలివి మీరిన వాటిలా
కనిపిస్తాయి. ఒరాంగుటాన్‌లెలాగు
మనిషికి దగ్గరి బంధువులేగా. నత్తలకు
శంఖులున్నా చినుకుపడితే చాలు
గొడుగు నీడన చేరతాయి.
పక్షులు కొమ్మల్లో నక్కుతాయి.
ఇలా వర్షాకాలంలో అవి
చేసే విన్యాసాలు
అన్నీఇన్నీ కావు.
ఫొటోగ్రాఫర్లకు
పండగే.







Check List

Book Number	KNSR02BH3	Date	3/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Lakshmi	Cutting By	Lakshmi
Scanned By	Prabhu	Pages	29